ఫ్రీ బస్.. రైట్..రైట్..

- స్త్రీ శక్తి పథకంపై మహిళల్లో హర్షాతిరేకాలు
- పేద, మధ్యతరగతి మహిళలకు ఆసరా

సూపర్‌సిక్స్‌లో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకానికి అన్ని వర్గాల మహిళలు రైట్ రైట్ చెబుతున్నారు. రోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి దుస్తులు, విస్తళ్లు, పాలు అమ్ముకునేవారు... చిన్న చిన్న ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసుకుని జీవనం సాగించే మహిళలకు ఈ పథకం ద్వారా ఆర్థికంగా పెద్దగా మేలు కలగనుంది. పేద, మధ్యతరగతి మహిళలకు ఆర్థికంగా ఎంతో ఆసరాగా ఉండే ఈ పథకం (స్త్రీ శక్తి)పై మహిళల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజులుగా బస్సుల్లో మహిళలు సంతోషంగా ప్రయాణిస్తున్నారు.


మహిళలకు ఉచిత టికెట్లు ఇస్తున్న కండక్టర్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు, రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించారు. ప్రతి జిల్లాలోనూ అక్కడి ఎమ్మెల్యేలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్‌లు ప్రజల మధ్య ఈ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలో రెండు రోజులుగా 5 ఆర్టీసీ డిపోల పరిధిలో 422 బస్సు సర్వీసులను ఈ పథకం కోసం నడిపారు. 315 పల్లెవెలుగు, 25 అల్ట్రా పల్లెవెలుగు, 55 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడిపారు. ఈ పథకం మొదలుపెట్టి రెండు రోజులే కావడంతో టికెట్లు ఇచ్చే సమయంలో కండక్టర్లు కొంచెం ఇబ్బందులు పడుతున్నారు. పల్లెమార్గాలలో ఇంకా ఎక్కువ పల్లెవెలుగు సర్వీసులు నడపాలని మహిళలు కోరుతున్నారు.

తిరుపతి వెళ్లి వచ్చా



నిన్నటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా వెళ్లవచ్చని తెలుసుకుని నేను ఈరోజు తిరుపతి నుంచి వస్తున్నాను. ఉచితంగా ఆడవాళ్ల ప్రయాణించే అవకాశం కల్పించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు. తిరుపతిలో మా బంధువుల ఇంటికి వెళ్లి రావాలంటే కనీసం రూ.300పైనే అవుతుంది. ఇప్పుడు ఆ డబ్బు నాకు మిగిలింది. నాకు చాలా సంతోషంగా ఉంది.

- వెంకటలక్షుమ్మ.. చిన్నమండెం

చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి



నేను రాయచోటి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాను. ఈరోజు ఉదయం నుంచి మూడు ట్రిప్పులు కడప-రాయచోటి తిరిగాము. ఈరోజు, రేపు సెలవులు ఉండడంతో మహిళలు పెద్దగా ప్రయాణించలేదు. సోమవారం నుంచి పూర్తి రద్దీ ఉంటుందని అనుకుంటున్నాను. ప్రస్తుతం కండక్టర్లకు కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. బస్సులో ఇద్దరు, ముగ్గురు పురుషులు ఎక్కినా.. వాళ్ల రూ.500 నోటు ఇచ్చి.. చిల్లర ఇవ్వమని అడుగుతున్నారు. చిన్న సమస్యలు త్వరలోనే సర్దుకుంటాయి.

- మహేశ్వరి, కండక్టర్, రాయచోటి

చిరు వ్యాపారులకు భరోసా



మాది మధ్య తరగతి రైతు కుటుంబం. మాకున్న పొలంలో కూరగాయలు పండిస్తుంటాం. పంటను గంపగుత్తగా అమ్మితే పెట్టుబడులు కూడా రావు. అందుకని నేను స్వంతంగా పీలేరు, కలికిరి, కలకడ, మహల్, గడి, గ్యారంపల్లెల్లో జరిగే సంతలకు కూరగాయలు తీసుకెళ్లి అమ్ముకుంటూ ఉంటాను. నాకు వారానికి రూ.1500 దాకా టికెట్ డబ్బులు అవుతుంటాయి. పచ్చి సరుకు కాబట్టి గిట్టుబాటు అయినా అవ్వకపోయినా అమ్ముకోవాల్సిందే. ఒక్కోసారి నాకు చార్జీల డబ్బులు కూడా గిట్టవు. ఇప్పుడు బస్సులు ఫ్రీ చేసినందుకు ఆ డబ్బులు మిగులుతాయి. ఇంకో రెండు ఊళ్లకు పోయి కూరగాయలు అమ్ముకోవచ్చుననే ధైర్యం కలిగింది. మాలాంటోళ్ల కష్టం చూసే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆ పథకం పెట్టారేమో. మాబోటోళ్లకు ఇంత కంటే ఏం కావాలి.

- సుగుణ, కలకడ

పల్లె రోడ్లలో సర్వీసులు పెంచాలి



మండల కేంద్రాలకు అనుసంధానంగా ఉండే గ్రామీణ మార్గాల్లో బస్సుల సంఖ్య పెంచాలి. గుర్రంకొండ-కలకడ, గుర్రంకొండ-వాల్మీకిపురం మార్గాల్లో ఆర్టీసీ బస్సులు తాలా తక్కువ. ఈ మార్గాల్లో ఎక్కడికైనా వెళ్లాలంటే చాలా ఇబ్బంది. గుర్రంకొండలో మినీ బ్యాంకు నిర్వహిస్తున్న నాకు ఉచిత బస్సు ప్రయాణంతో ఎంతో లాభం చేకూరుతుంది. నిన్నటి నుంచి నేను నడిమిచెర్ల నుంచి గుర్రంకొండకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నా. నాలాంటి చాలా మంది మహిళలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది.

- పుష్పాంజలి, మినీ బ్యాంకు నిర్వాహకురాలు, గుర్రంకొండ

ఉచిత బస్సు ఎంతో ఉపయోగం



సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు చాలా మేలు. ఎక్కువగా పల్లెల నుంచి చాలా మంది ఆడవాళ్లు పనుల కోసం పట్టణాలకు వెళ్తారు. కూలీనాలీ చేసుకుని మాలాంటోల్ల తాన చార్జీలకు కూడా ఒక్కోసారి డబ్బులు ఉండవు. అప్పుడు పనులు ఉన్నా..ఊర్లకు వెళ్లకపోతారు. ఇప్పుడు చంద్రబాబు పేరు చెప్పి ఆడోళ్లంతా ప్రయాణాలు చేస్తారు. మాకు చాలా సంతోషంగా వుంది. నేను వేపూరికోటలో బస్సు ఎక్కి ములకలచెరువుకు ఉచితంగా వచ్చాను. రానుపోను నాకు నూరు రూపాయలు మిగిలింది.

- కె.రత్నమ్మ, ములకలచెరువు మండలం

నష్టాన్ని అధిగమించే మార్గాలు అన్వేషిస్తాం



మహిళలకు కల్పించిన స్త్రీ శక్తి పథకం వల్ల ఆర్టీసీకి వచ్చే నష్టాన్ని అధిగమించే మార్గాలను అన్వేషిస్తాం. అందులో భాగంగా పీలేరు డిపో నుంచి పీలేరు-తిరుపతి మధ్య రెండు, పీలేరు-చిత్తూరు మధ్య ఒకటి, పీలేరు-రాయచోటి మధ్య ఒకటి, పీలేరు-సదుం మార్గంలో ఒక అదనపు సర్వీసులు నడపాలని ప్రతిపాదనలు పంపి ఉన్నాం. పీలేరు డిపోలో 87 సర్వీసులు ఉండగా వాటిలో 94 శాతం సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉన్నది. పీలేరు-తిరుపతి మధ్యలో భాకరాపేట ఘాటు రోడ్డు ఉన్నది కాబట్టి సీట్లలో కూర్చునేంత వరకు అనుమతిస్తాం. ఘాటు రోడ్డు మార్గాల్లో ఓవర్‌లోడింగ్ చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

- బి.నిర్మల, డిపో మేనేజర్, పీలేరు

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడి విగ్రహం

ములకలచెరువు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపూరికోట సమీపంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద వెలసిన అవధూత ఆదినారాయణ స్వామి ఆశ్రమంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇక్కడ భారీ శ్రీకృష్ణుడి విగ్రహం 35 అడుగులకుపైగా ఉంది. కృష్ణుడికి పాలతో అభిషేకం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆశ్రమంలో భజనలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఆశమ నిర్వాహకులు వెంకటసుబ్బారెడ్డి స్వామి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అండర్-19 రాష్ట్ర హాకీ జట్టు కెప్టెన్‌గా అఖిల్ వెంకట్

- మదనపల్లె క్రీడాకారుడి ప్రతిభ


రాష్ట్ర హాకీ జట్టుకు ఎంపికైన అఖిల్ వెంకట్

మదనపల్లె టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అండర్-19 హాకీ జట్టు కెప్టెన్‌గా మదనపల్లెకు చెందిన క్రీడాకారుడు అఖిల్ వెంకట్ ఎంపికయ్యాడు. స్థానిక హౌసింగ్‌శాఖ ఉద్యోగి శ్రీనివాసులు కుమారుడు అఖిల్ వెంకట్ హాకీలో మెరుగైన ప్రతిభ కనబరుస్తూ జిల్లా జట్టు నుంచి రెండేళ్లగా రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ క్రమంలో పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో నిర్వహించే 15వ జాతీయ జూనియర్ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనబోయే రాష్ట్ర హాకీ జట్టుకు అఖిల్ వెంకట్‌ను కెప్టెన్‌గా నియమిస్తూ రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు చాణుక్యరాజు, ప్రధాన కార్యదర్శి హర్షవర్దన్, సీఈవో నిరంజన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌కు అఖిల్ వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లెకు చెందిన సీనియర్ హాకీ క్రీడాకారులు అఖిల్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కట్టారు.. వదిలేశారు
- నిరుపయోగంగా రూ.2.68 కోట్ల విలువైన భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సచివాలయాలు
6

హార్సిలీహిల్స్‌లో మంత్రి సత్యకుమార్


హార్సిలీహిల్స్‌లో పర్యటిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తదితరులు

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఒక రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాత్రి హార్సిలీహిల్స్‌కు చేరుకుని అటవీ శాఖ అతిథి గృహంలో బస చేశారు. విషయం తెలుసుకున్న మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు శనివారం ఉదయాన్నే హిల్స్‌కు చేరుకుని మంత్రిని కలిసేందుకు నిరీక్షించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంత్రిని కలిసి మదనపల్లి జిల్లా ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైందని కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మంత్రికి పలువురు సామాజిక, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు సమర్పించారు. స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా బురకాయలకోటను మండల కేంద్రంగా ప్రకటించారని కొందరి స్వార్థం కారణంగా అందులో మార్పులు జరిగాయని, ఇప్పుడు మళ్లీ మార్పులు చేసి తమకు న్యాయం చేయాలని బురకాయలకోట గ్రామస్థులు కోరారు. బి.కొత్తకోట మండలంలోని అనేక గ్రామాలు పీటీఎం పీహెచ్‌సీ పరిధిలో పనిచేయాల్సి వస్తోందని బి.కొత్తకోట మండలంలోనే ఏదో ఒక గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ సిబ్బంది కోరారు. బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి, నాయకులు సేతు, కిరణ్‌లు కలిసి పలు సమస్యలపై చర్చించారు. మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడకుండా ఇది పూర్తిగా వ్యక్తిగత పర్యటన అని, మరోసారి హార్సిలీహిల్స్‌కు వచ్చి అధికారికంగా మాట్లాడుతానన్నారు. చివరగా పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల్‌రెడ్డి, ఫరీద్‌ఖాన్, శోభారాణి, కావడి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడికి స్నపన తిరుమంజనం


సుగంధ ద్రవ్యాలను తీసుకువస్తున్న ఆలయ అధికారులు

ఒంటిమిట్ట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో శనివారం స్నపన తిరుమంజన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. అలయ అర్చకులు వీణా రాఘవాచార్యులు, మనోజ్‌కుమార్‌లు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ సుగంధ ద్రవ్యాలను, పట్టు వస్త్రాలను, పుష్పాలను ఆలయ అర్చకులకు అందజేశారు. స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శనివారం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పసుపులేటి సుబ్బరాయుడు దంపతులు మేకపాటి శివప్రసాద్ దంపతులు, ఆలయ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని కల్యాణం

- భారీగా హాజరైన భక్తులు
- కల్యాణ లడ్డూ రూ.3 లక్షలు


మంగళసూత్రాన్ని భక్తులకు చూపుతున్న వేద పండితులు


లడ్డూను వేలం పాటలో దక్కించుకున్న రామాంజనేయులు

నందలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలోని శ్రీకృష్ణమందిర ఆవరణంలో అశేష భక్తుల మధ్య శనివారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మాజీ ఎంపీపీ పల్లె సుబ్రమణ్యం, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ దంపతులు సమర్పించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి బస్టాండు కూడలి వరకు కోలాటాలు, డప్పుల వాయిద్యాలు, బాణాసంచా నడుమ అంగరంగ వైభవంగా గ్రామోత్సవం జరిగింది.


కల్యాణానికి పెద్దఎత్తున హాజరైన మహిళలు

రూ.3 లక్షలు ధర పలికిన కల్యాణ లడ్డూ

శ్రీకృష్ణుని కల్యాణం వద్ద నిర్వహించిన వేలం పాటలో అత్యధికంగా లడ్డూ రూ.3 లక్షల రూపాయల ధర పలికింది. ఈ లడ్డూను భారత పురావస్తు శాఖ మాజీ ఉద్యోగి చెంగారి రామాంజనేయులు దక్కించుకున్నారు. రూ.25 కిలోల ఈ లడ్డూను తెలుగుదేశం పార్టీ రాష్ట అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

డీటీఈ యాప్‌తో మోసపోయారు...

- వీడియోల పేరుతో కుచ్చుటోపీ
- జిల్లాలో 5 వేల మందికి పైగా బాధితులు



డీటీఈ యాప్‌లో వార్షికోత్సవ సెలబ్రేషన్ వివరాలు
మెంబర్‌షిప్‌ను కొనసాగించడానికి అదనంగా చెల్లించాల్సిన డబ్బు వివరాలు

కురబలకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అవసరాల మేరకు తక్కువ డబ్బు పెట్టుబడితో అధిక లాభాలను ఆర్జించవచ్చనే అత్యాశకు పోయి మోసపోతున్న సంఘటనలు కోకొల్లలు. ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్, వివిధ రకాల యాప్‌లలో మోసపోయి రోడ్డున పడటంతో పాటు ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్న వారిని రకరకాల మాధ్యమాల ద్వారా చూస్తూనే ఉన్నాం. అయితే ఇంత జరుగుతున్నా మోసగాళ్ళు మాత్రం కొత్తదారులలో అమాయకులను ఏదో రకంగా మోసం చేస్తూనే ఉన్నారు. కొద్ది రోజుల క్రితం ఆరా యాప్‌తో ప్రజలు మోసపోయారు. అది మరిచిపోకముందే మళ్లీ తాజాగా డీటీఈ యాప్ పేరుతో ప్రజలు మోసపోయారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలలో విస్తరించి కోట్లాది రూపాయలు కాజేశారు.

రూ.2 వేల నుంచి మెంబర్‌షిప్

డీటీఈ యాప్‌లో సభ్యులుగా చేరేవారు డీ1కు రూ.2 వేలు, డీ2కు రూ.3600, డీ3కు రూ.10,800, డీ4కు 32,500, టీ1కు 81,200, టీ2కు రూ.1,78,400 మెంబర్ షిప్‌లు ఉంటాయి. అయితే డిపాజిట్‌కు తగ్గట్టు యాడ్స్ చూస్తే డబ్బులు వస్తాయి. 100 శాతం డిపాజిట్ రిటర్న్ వస్తుందని మొదటి ఏడాది సెలబ్రేషన్ పేరుతో ప్రచారం చేశారు. దీంతో చాలామంది ఎగబడి మరి చేరారు. దీనికోసం వాళ్ల పొందిన మెంబర్ షిప్ ఆధారంగా ప్రతిరోజూ 5 నుంచి 200 వీడియోలు చూడాల్సి ఉంటుంది. దీనికిగానూ కనిష్ఠంగా వారానికి రూ.1380 నుంచి గరిష్ఠంగా రూ.15 వేల వరకు దాదాపుగా చెల్లిస్తారు. కాగా ప్రభుత్వ సెలవు రోజుల్లో ఈ వీడియోలు రావు. అయితే ఇందులో చేరిన వారు వారి కింద జాయిన్ చేసుకుంటే వారికి అదనంగా రెఫరల్ బోనస్ ద్వారా ఇస్తారు. వీటితో పాటు ఒక మెంబర్ కింద లక్కీ వీల్ వస్తుంది. దీంతో వారికి రకరకాల బహుమతులు, గిఫ్టులు వస్తాయి. కాగా ఈ అమౌంట్ వారి వాలెట్‌కు వేస్తారు. అనంతరం అక్కడి నుంచి వారి బ్యాంకు అకౌంట్ నుంచి డ్రా చేసుకోవచ్చు. ఇలా ప్రతి శుక్రవారం డబ్బును డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఇది 6 నెలలుగా విపరీతంగా విస్తరించింది. దీంతో చాలామంది మెంబర్‌షిప్ పొందిన వ్యక్తులు దాదాపుగా లక్షలలో సంపాదించారు. తాము సంపాదించిన విషయం చుట్టుపక్కల వారికి తెలియజేయడంతో ఆశపడి విపరీతంగా చేరారు. కాగా ఈ యాప్‌లో మూడు వారాలుగా డబ్బులు డ్రా చేసుకునే అవకాశాన్ని నిలిపివేసింది. అయితే మళ్లీ వారి లెవల్ స్థాయిని బట్టి రూ.2 వేల నుంచి రూ.72,900 వరకు చెల్లించాలని అలాంటి వారి మెంబర్‌షిప్ కొనసాగుతుందని మిగిలిన వారి మెంబర్‌షిప్ రద్దు చేస్తామని యాప్‌లో పేర్కొన్నారని పలువురు బాధితులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 5 వేల మందికి పైగా ఈ సంస్థలో మెంబర్‌షిప్ పొందినట్లు పలువురు చెబుతున్నారు. కాగా మదనపల్లె, కురబలకోట, వాల్మీకిపురం, ములకలచెరువు తదితర చోట్ల అత్యధికంగా బాధితులు ఉన్నారు. కాగా చాలామంది అందరికీ తెలిస్తే పరువుపోతుందని ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. అయితే కొంతమంది మాత్రం పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

కట్టారు.. వదిలేశారు

- నిరుపయోగంగా రూ.2.68 కోట్ల భవనాలు
- పంచాయతీపై నెలకు అద్దెభారం రూ.60 వేలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సచివాలయ భవనాలు
- పట్టించుకోని అధికారులు

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో సచివాలయాలు నడుపుతున్నారు. పర్యవసానంగా పీలేరు మేజర్ గ్రామ పంచాయతీపై నెలకు రూ.60 వేల అద్దె భారం పడుతోంది.

పీలేరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పీలేరు పట్టణంలో ఐదు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటవ సచివాలయం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంది. ఇదొక్కటే సొంత భవనంలో ఉంది. ఇందిరానగర్, జేకేనగర్, కడప రోడ్, కోటపల్లె మార్గంలో ఉన్న నాలుగు సచివాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.45 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు మంజూరు చేశారు. పీలేరు పట్టణంలో నాలుగు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం కోసం రూ.2.68 కోట్లు మంజూరయ్యాయి. క్రాంట్రాక్టులు దక్కించుకున్న నాలుగు సచివాలయాలకు గాను మూడింటి నిర్మాణం పూర్తిచేశారు. ఒక్కటి మాత్రం అర్ధంతరంగా ఆగిపోయింది.

పీలేరు పట్టణం కామాటంవారిపల్లె వద్ద సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలు పూర్తి స్థాయిలో నిర్మించారు. కాగా ఇందిరానగర్‌లో సచివాలయాన్ని తమ స్థలంలో నిర్మించారంటూ బాలికల ఉన్నత పాఠశాల కోర్టుకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకుంది. అధికారుల అత్యుత్సాహం కారణంగానే నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని పాఠశాలకు అప్పగించాల్సి వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రైతు భరోసా కేంద్ర నిర్మాణం సైతం సగంలో ఆగిపోయింది. పట్టణ నడిబొడ్డున ఉన్న సీఎల్ఆర్‌సీ కార్యాలయ సమీపంలో ఒక సచివాలయం, రైతుభరోసా కేంద్ర నిర్మాణం పూర్తి కాగా, మరో సచివాలయం, రైతు భరోసా కేంద్ర నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పీలేరు పంచాయతీ అధికారులు నిర్మాణం పూర్తయిన భవనాలను స్వాధీనం చేసుకున్నా ప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో నాలుగు సచివాలయాల అద్దె భారం పంచాయతీపై పడుతోంది. దీనికి తోడు నిర్మాణం పూర్తయిన భవనాలను వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్మాణం పూర్తయ్యాక ఇందిరాగనర్ బాలికోన్నత పాఠశాల స్వాధీనం చేసుకున్న సచివాలయ భవనం

త్వరలోనే ప్రారంభిస్తాం
- లతీఫ్ ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు



చిన్నిచిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. అన్ని పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా సచివాలయ కొత్త భవనాలను ప్రారంభిస్తాం. పంచాయతీపై నెలనెలా మోయలేని అద్దె భారం పడుతోంది. నిర్మాణం పూర్తయిన భవనాలను పంచాయతీ స్వాధీనం చేసుకుంటుంది. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సంప్రదించి పంచాయతీ ఆధీనంలోకి తీసుకుంటాం.



సీఎల్ఆర్‌సీ కార్యాలయం వద్ద నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనం - ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం

పశు వైద్యాధికారికి రాష్ట్ర స్థాయి

ఉత్తమ సేవా పురస్కారం


ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకొంటున్న డాక్టర్ సురేశ్

నిమ్మనపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశు సంవర్ధక శాఖలో పశు వైద్యులుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సురేశ్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి అత్యధికంగా పెయ్యదూడల కృత్రిమ గర్భధారణ ప్రోత్సహించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరులో జరిగిన సమావేశంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకున్నానని తెలిపారు. అయితే ఇదే ఏడాదిలో 780 పెయ్యదూడలకు కృత్రిమ గర్భధారణను ప్రోత్సహించామని దీని ద్వారా 90 శాతం ఆవులలో ఎలాంటి సమస్య లేకుండా పెయ్యదూడలు మాత్రమే పుడతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కృత్రిమ గర్భధారణకు ఉపయోగించే సూదిమందు రూ.500 ఉండగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దానిని రూ.150కే ఇస్తోందని తెలిపారు. దీంతో అధిక శాతం పాడి రైతులు పెయ్యదూడల సూది కొరకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

కోళ్లబైలులో ఆక్రమణలు తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లబైలు గ్రామం, అమ్మచెరువు మిట్టలో శనివారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇందులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు తొలగించి చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోళ్లబైలులో పలు చోట్ల పునాదులను, కట్టడాలను పరిశీలించారు. ఇందులో ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, వీర్వోలు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ నేరమా?

హెడ్ కానిస్టేబుల్‌పై కూటమి నాయకుల ఫిర్యాదు


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

సుండుపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండాతో ర్యాలీ పట్టుకోవాలంటే అనుమతులు తీసుకోవాలా అని బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు ప్రశ్నించారు. శుక్రవారం ర్యాలీని అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ సాదక్‌అలీ తీరును తీవ్రంగా ఖండించారు.

హర్ ఘర్ తిరంగా పేరుతో దేశ ప్రధాని నరేంద్రమోదీ ఊరూవాడా ర్యాలీలు నిర్వహించి దేశఖ్యాతిని చాటుతుంటే జెండాకు సెల్యూట్ కొట్టాల్సిన హెడ్ కానిస్టేబుల్ ర్యాలీని అడ్డుకొని అనుమతులు ఉన్నాయా అని అడగడం సిగ్గుచేటన్నారు. అలాంటి వ్యక్తిని విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలని సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్, జనసేన సీనియర్ నాయకులు రామా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఎర్రంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచరాయుడు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిచర్ల శంకరయ్య, ఉపాధ్యక్షులు రెడ్డెయ్యఆచారి, గాలి భాస్కర్, సుధాకర్, చంద్రమోహన్, శ్రీనివాసరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో చేపల వేటకు వెళ్లొద్దు : సీఐ


సిద్దవటంలోని పెన్నానది వద్ద సీఐ బాబు

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో నీటి ప్రవాహం రోజురోజుకు పెరుగుతోందని, మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్లవద్దని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. శనివారం ఆయన సిద్దవటం వద్ద పెన్నానదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల పెన్నానదిలో నీటి ఉధృతి పెరుగుతోందని ప్రజలతో పాటు సందర్శకులు ఎవరూ నదిలో దిగవద్దని తెలిపారు. లోలెవల్ లోకాజ్‌వే వద్ద ఎవరైనా సంచరిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెన్నానదిలో నీటి మట్టం తగ్గేవరకు ఇద్దరు పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పెన్నానది వద్ద ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం తెలపాలని మండల వాసులకు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం గ్రామం, రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శనివారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తాలుకా పోలీసులకు సమచారం అందించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి గుర్తుతెలియని యువకుడిగా నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని కదిరి రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరికి తరలించినట్లు తెలిపారు.

హిల్స్‌లో సందడే.. సందడి

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ శనివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సహజంగా వారాంతంలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దానికి తోడు కృష్ణాష్టమి నేపథ్యంలో వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హార్సిలీహిల్స్‌కు పర్యాటకులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా హిల్స్‌కు చేరుకొని ఉల్లాసంగా గడిపారు. గాలిబండ, పాత, కొత్త వ్యూపాయింట్స్, అటవీశాఖ ప్రాంగణంలో కలియతిరుగుతూ, మానస సరోవరంలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. సముద్రమట్టానికి 4212 అడుగుల ఎత్తులో చల్లని, ఆహ్లాదకర వాతావరణంలో కలిగే సరికొత్త అనుభూతిని ఆస్వాదిస్తూ తన్మయత్వం చెందారు. పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో ఏపీ టూరిజం, అటవీ సముదాయంతో పాటు ప్రైవేటు గెస్టహౌస్‌లు పూర్తిగా నిండిపోయాయి.


మానస సరోవరంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

విషపురుగు కాటుకు రైతు మృతి


వెంకటయ్య మృతదేహం

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నీరు కట్టేందుకు పొలానికి వెళితే విషపురుగు కుట్టడంతో రైతు వెంకటయ్య (40) మృతి చెందాడు. మండలంలోని వెలుగుపల్లె గ్రామానికి చెందిన వెంకటయ్య గ్రామానికి పడమటి భాగంలో ఉన్న తన పొలంలో వరి పంట సాగు చేశాడు. శనివారం ఉదయం పొలానికి నీరు కట్టేందుకు ఉదయం 6 గంటలకు పొలంలోకి వెళ్లాడు. పొలానికి నీరు కడుతుండగా విషపురుగు కుట్టడంతో పొలం పక్కనే ఉన్న రైతు వెంగయ్యకు చెప్పడంతో ద్విచక్ర వాహనంలో భాకరాపేట గ్రామంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యసేవల కోసం కడప రిమ్స్‌కు ఆటోలో తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వెంకటయ్య భార్య వెంకటసుబ్బమ్మ, కుమార్తె ఉన్నారు. పంటల ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 లక్షలు పైబడి అప్పు చేశాడని, రాష్ట్ర ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడవి భార్య కన్నీటిపర్యంతమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవి

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవి వ్యాపారులకు తెలిపారు. ఆయన మార్కెట్ పరిసర ప్రాంతాలను శనివారం పరిశీలించారు. వ్యాపారులతోకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ప్రజలు మార్కెట్‌కు వచ్చేటప్పుడు విధిగా గుడ్డ సంచి లేదా జూట్ బ్యాగ్ వెంట తెచ్చుకోవాలని తెలియజేశారు. పట్టణ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకరించాలని ప్రజలకు వివరించారు. రాయచోటి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయడానికి ప్రజల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని తెలియజేశారు. మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా లేకపోతే రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆ..రెండూ అందని ద్రాక్షేనా...?

- ఆర్టీసీ డిపో అదిగో..ఇదిగో మాటలకే సరి...
- డిగ్రీ కాలేజీదీ.. అదే తీరు...
- దశాబ్దాలుగా ఊరిస్తున్న ఆ రెండూ...


ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక వేచి ఉన్న విద్యార్థులు

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణం తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రధానమైనది. జనాభా 40 వేలకు పైనే. పొరుగు మండలాలైన పీటీఎం, ములకలచెరువులతో పాటు సరిహద్దు కర్ణాటక గ్రామాల ప్రజలతో కనెక్టివిటీతో చాలా రద్దీగా ఉండే పట్టణం. మేజర్ పంచాయతీగా ఉంటూ నగర పంచాయతీగా ప్రమోట్ అయిన పట్టణం. బి.కొత్తకోట నుంచి మదనపల్లి, కదిరితో పాటు కర్ణాటక రాజధాని బెంగళూరు వైపు వందలమంది ప్రయాణాలు సాగిస్తుంటారు. అదే విధంగా పొరుగు మండలాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు చదువుకునేందుకు, రైతులు కొనుగోళ్లు, అమ్మకాలకు నిత్యం బి.కొత్తకోటకు వచ్చి తీరాల్సిందే. ఇలాంటి ప్రధాన పట్టణానికి తలమానికంగా ఉన్న ఆర్టీసీ డిపో రద్దు చేసి దశాబ్దం దాటింది. డిగ్రీ కాలేజి వచ్చేస్తోందంటూ పాలకులు నమ్మబలికి దశాబ్దం కావస్తోంది. ఈ రెండింటిపై ఆశలు వదులుకోలేక బి.కొత్తకోట ప్రజానీకంతో పాటు ఈ పట్టణంతో కనెక్టివిటీ ఉన్న 300 గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

డిగ్రీ కాలేజి వచ్చేసిందంటూ మాయమాటలు..

బి.కొత్తకోటకు అత్యవసరమైన వాటిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఒకటి. కొత్తకోట నుంచే కాకుండా పీటీఎం, ములకలచెరువు మండలాల నుంచి వందల సంఖ్యలో డిగ్రీ విద్యార్థులు బి.కొత్తకోటలో చదువుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజి లేక ప్రైవేటు కాలేజిలలో చేరారు. వీరి నుంచి ఓ వైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో మరోవైపు ప్రైవేటు కాలేజిల యాజమాన్యాలు దోచేస్తున్నాయి. పట్టణంలో మూడు ప్రైవేటు డిగ్రీ కాలేజిలు ఉండగా అధికారులు సైతం వీరికి సహకరిస్తున్నారు. డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయండి అని ప్రజాసంఘాలు, విద్యార్థుల తల్లితండ్రులు మొరపెట్టుకుంటున్నా ఆలకించే నాయకులు కరువయ్యారు. డిగ్రీ కాలేజి ఏర్పాటుకు కొన్నిసార్లు ప్రయత్నాలు జరిగినా అందులో చిత్తశుద్ధి లోపించి అర్ధంతరంగా ఆగిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి 2013లో బి.కొత్తకోటలోనే జరిగిన బహిరంగసభలో డిగ్రీ కాలేజి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. బెంగళూరు రోడ్డులో శంకరయ్యస్వామి ట్రస్ట్ భూమిలో నూతన నిర్మాణం అన్నారు. అమలు కాలేదు. మరోసారి స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజి భవనాలలో తాత్కాలికంగా డిగ్రీ తరగతులు సైతం ప్రారంభిస్తామని చెప్పినా అదీ జరగలేదు.

కలగా మారిన ఆర్టీసీ డిపో

బి.కొత్తకోట పట్టణానికి అభివృద్ధి పరంగా ఆర్టీసీ డిపో కీలకమైంది. మదనపల్లె ఎమ్మెల్యేగా ఉన్న ఆవుల మోహన్‌రెడ్డి ఆర్టీసీ డిపోను తెచ్చారు. 2006 డిసెంబరు 31న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 14 డిపోలను రద్దు చేశారు. అందులో బి.కొత్తకోట ఒకటి. వాటిలో స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో అంచెలంచెలుగా 13 డిపోలు మళ్లీ ప్రారంభమవ్వగా బి.కొత్తకోటకు మాత్రం దిక్కులేకుండా పోయింది. డిపో సాధన కోసం ప్రజాసంఘాలు, స్థానిక నాయకుల కృషి ఫలించలేదు. అప్పటి నుంచి అధికారంలోకి వచ్చిన పార్టీ, లోకల్ ఎమ్మెల్యే అదిగో..ఇదిగో అనడం తప్ప కార్యరూపం దాల్చింది లేదు. ఒకటికి రెండుసార్లు స్థలాలు ఎంపిక చేయడం, బి.కొత్తకోట లోగోతో బస్సులను నడపటం, అధికారులను పిలిపించి హడావిడి చేయడం తప్ప డిపో వచ్చింది లేదు. గతంలో డిపో ఏర్పాటుకు భూమి ఇస్తామన్న పాపానికి ఓ కుటుంబం చిక్కుల్లో పడింది. తాజాగా వైసీపీ హయాం చరమాంకంలో గంగమ్మ మాన్యంలో డిపో ఏర్పాటు చేసేస్తున్నారని, బస్సులు కూడా వచ్చేస్తాయని ప్రచారం మాత్రమే జరిగింది. గ్రామాల నుంచి బి.కొత్తకోటకు రావడానికి, సాయంత్రం తిరిగి వెళ్లడానికి విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

ఆర్టీసీ డిపో కోసం ఎంపిక చేసిన స్థలంలో నిర్మించిన షెడ్డు


నాయకులు చొరవ చూపాలి..

రాష్ట్రంలో రద్దయిన ఆర్టీసీ డిపోలన్నీ మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక్కడి నాయకులకు సాధించాలన్న పట్టుదల లేకపోగా ఎవరి స్వార్థం వారిది. ప్రజాసమస్యలు, పట్టణ అభివృద్ధిపై అంకితభావం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆర్టీసీ డిపో, డిగ్రీ కాలేజిల సాధనకు అధికార పార్టీ నాయకులు కృషి చేయాలి. ఆ ప్రయత్నాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

- మనోహర్‌రెడ్డి, బి.కొత్తకోట

యువతి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న పవిత్ర (ఫైల్ ఫొటో)

ప్రొద్దుటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పాతికేళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం ప్రొద్దుటూరులోని స్వరాజ్యనగర్‌లో చోటు చేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వరాజ్యనగర్‌కు చెందిన పల్లోలి జయమ్మ, రవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు సౌజన్యకు పెళ్లయింది. రెండో కూతురు పవిత్ర ఎంటెక్ పూర్తి చేసి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన తన బంధువుల అబ్బాయి ధారా వినోద్‌కుమార్‌ను ప్రేమించింది. వీరి ప్రేమను పవిత్ర తల్లిదండ్రులు అంగీకరించారు. వచ్చే సంవత్సరం పెళ్లి కూడా చేయాలని అనుకున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కాలేజీకి వెళ్లి 10.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చింది. సాయంత్రం 6 గంటలకు ఇంటిపైన వున్న రేకుల గదికి వెళ్లింది. రాత్రి 8 గంటలు అవుతున్నా కిందికి రాకపోవడంతో తల్లి వెళ్లి ఎంత గట్టిగా తలుపు కొట్టినా పలకకపోవడంతో కిటికిలో నుంచి చూసింది. పవిత్ర చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో జయమ్మ గట్టిగా కేకలు వేసింది. దీంతో జయమ్మ భర్త, పెద్ద కూతురు, చుట్టుపక్కల వారు పైకి వచ్చి తలుపు పగలగొట్టి పవిత్రను కిందకు దించారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ సదాశివయ్య కేసు నమోదు చేశారు,

ప్రమాదవశాత్తు కోనేటిలో పడి వ్యక్తి మృతి


క్రిష్ణయ్య మృతదేహం

సింహాద్రిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట శైవ క్షేత్రంలో కటిక పెద్ద క్రిష్ణయ్య(54) శనివారం ప్రమాదవశాత్తు కోనేటిలో పడి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణయ్య భానుకోటకు వెళ్తున్నట్లు భార్య గంగమ్మకు చెప్పి శుక్రవారం ఇంటినుండి వచ్చాడు, తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య గంగమ్మ ఆందోళనకు గురైంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు క్రిష్ణయ్య భానుకోటలో ప్రమాదవశాత్తు కోనేటిలో పడినట్లు మృతి చెందినట్లు తెలిసింది. పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


గుండం నుంచి వెలికితీసిన హబీబుల్లా మృతదేహం


హబీబుల్లా ఫైల్‌ఫొటో


అట్లూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంకమల క్షేత్రంలో లంకమల్లేశ్వరుని పక్కనే ఉన్న పసుపు గుండంలో ఈత కొడుతూ గల్లంతైన హబీబుల్లా మృతదేహం లభించినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా హబీబుల్లా మృతదేహం లభ్యం కాకపోవడంతో శనివారం ఉదయమే పోలీసు, ఫైర్ సిబ్బంది గుండమంతా గాలించి 30 అడుగుల లోతులో ఉన్న హబీబుల్లా మృతదేహాన్ని మధ్యాహ్నం 3గంటల వరకు శ్రమించి వెలికితీశారని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ గాలింపు చర్యల్లో ఫైర్ ఆఫీసరు చంద్రుడు, పోలీసు సిబ్బంది నాగేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమణ తదితరుల పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

వల్లూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వల్లూరులో శనివారం జరిగిన కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పొలాల్లో సంచరిస్తూ వల్లూరు గ్రామం చుట్టూ ఉన్న కుక్కలు దాడి చేయడంతో జింక పిల్ల మృతి చెందిందన్నారు. ఈ విషయంపై పోలీసులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో చనిపోయిన జింక పిల్లకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.


మృతి చెందిన జింక పిల్ల

మాయరోగం ఫట్




జిల్లాలో ఉన్న బోగస్ సదరం సర్టిఫికెట్లను వైద్యాధికారులు గుర్తించారు. అంగవైకల్యం ధృవీకరణ కోసం వికలత్వపు పెంఛన్లు పొందుతున్న లబ్దిదారులకు దశల వారీగా నోటీసులు జారీ చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. కొంతమంది వైద్య పరీక్షలకు హాజరు కాగా మరి కొంతమంది గైర్హాజరయ్యారు. తిరిగి వారికి వైద్య పరీక్షల తేదీని ఖరారు చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఎట్టకేలకు అనర్హులను ప్రభుత్వం గుర్తించింది. దీంతో జిల్లాలో 7577 పింఛన్లను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకుంది. పలు మార్లు పింఛన్ల కోసం మాయ రోగం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో అధికారులు సదరం సర్టిఫికెట్లపై నిఘా ఉంచారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా వైకల్య పింఛన్లు మంజూరయ్యాయి. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఉన్న వైకల్య పింఛన్ల కంటే వైసీపీ హయాంలో అత్యధికంగా పెరిగాయి.

- 7577 పింఛన్ల నిలిపివేత
- కడప పట్టణంలోనే అత్యధికం
- సిద్దవటంలో అత్యల్పం

కడప ఎన్జీఆర్ సర్కిల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాల్లో ఉన్న ఆసుపత్రులలో వైకల్య సర్టిఫికేట్ పొందారు. ఈ సర్టిఫికేట్ల ఆధారంగా దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లు పొందేవారు. వీటిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ముందుగా ఇతర జిల్లాల్లో ఇచ్చిన వికలత్వ సర్టిఫికేట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో అత్యధికంగా వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు .ఈ మేరకు 232 బోగస్ వైకల్య సర్టిఫికెట్లను రద్దు చేశారు. వీటితో పాటు ఆ తర్వాత చేపట్టిన సర్టిఫికెట్ల నిర్ధారణలో 1087 మందికి నకిలీ సర్టిఫికేట్లుగా గుర్తించడం జరిగింది. వీటిలో అత్యధికంగా పోరుమామిళ్ల మండలంలో 69, కలసపాడులో 68, ఎర్రగుంట్ల 60, ముద్దనూరు 57, కమలాపురం 51, మైదుకూరు 50, తొండూరు 42, పులివెందుల 22, వివిధ మండలాల్లో పదికి పైగానే సదరం సర్టిఫికేట్లను బోగస్‌గా గుర్తించారు. ఈ మేరకు గత ఏడాది సెప్టెంబరు నెలలో వీరి పింఛన్లను రద్దు చేయాలంటూ అప్పటి కలెక్టరు శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో 7577 పింఛన్లు రద్దు

ఆ తరువాత చేపట్టిన అంగ వైకల్య ధృవపత్రాల పరిశీలనలో మరో 7577 మంది తమకు ఎలాంటి వికలత్వం లేకున్నప్పటికీ కేవలం పింఛన్ల కోసమే సదరం సర్టిఫికేట్లు పొందారని వైద్యాధికారులు గుర్తించారు. వీరిలో 4581 మందికి 40 శాతం తక్కువ వికలత్వం ఉన్నట్లు, 74 మందికి 45శాతం కంటే ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఇక ఇతర అనారోగ్య సమస్యల కారణంగా పొందిన 2022 సర్టిఫికేట్లను నకిలీవిగా అంటే ఎటువంటి వికలత్వం లేకుండా వైద్యాధికారుల నుంచి పొందినటు గుర్తించారు. ఈ క్రమంలో జిల్లాలో మొత్తం 7577పింఛన్లను నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం పేర్కొన్నారు. ఇందులో కడప పట్టణంలో 558 పింఛ్లు రద్దయిన జాబితాలో ఉండగా ఇది అత్యధిక స్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే విధంగా వేంపల్లె మండలంలో 529, అట్లూరులో 67, బి.కోడూరులో 120, బద్వేలులో 81, బద్వేలు పట్టణ ప్రాంతంలో 115, బి.మఠంలో 127, చక్రాయపేటలో 204, చాపాడులో 210, చెన్నూరు మండలంలో 102, సీకేదిన్నెలో 156, దువ్వూరులో 246, గోపవరంలో 65, జమ్మలమడుగు మండలంలో 86, మున్సిపాలిటీ పరిధిలో 79, కలసపాడులో 117, కమలాపురంలో 227, ఖాజీపేటలో 117, కొండాపురం 301, లింగాల 439, ముద్దనూరులో 297, మైలవరంలో 115, పెద్దముడియం 248, పోరుమామిళ్ల 119, ప్రొద్దుటూరు మండలంలో 221, మున్సిపాలిటీ పరిధిలో 202 బోగస్ పత్రాలున్నట్లు గుర్తించారు. అదేవిధంగా పులివెందులలో 121, మున్సిపాలిటీ ఏరియాలో 748, రాజుపాలెం 89, మైదుకూరులో 133, మున్సిపాలిటీ పరిధిలో 132, కాశినాయన మండలంలో 114, సిద్దవటంలో 50, సింహాద్రిపురంలో 201, తొండూరులో 301, వల్లూరు మండలంలో 86, వీఎన్‌పల్లె మండలంలో 202, వేంపల్లెలో 529, వేములలో 165, ఒంటిమిట్టలో 72, ఎర్రగుంట్లలో 122, మున్సిపాలిటీ పరిధిలో 60 వికలత్వ పింఛన్లను రద్దు చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.



ఈనెల నుంచే పింఛన్ల నిలుపుదల..



రద్దయిన వికలత్వ పింఛన్లను ఈ నెల నుంచే నిలుపుదల చేయడం జరుగుతుంది. ఈ జాబితాలో అనర్హులుగా తేలినవారు ఎవరైనా మరోమారు తమ వికలత్వాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఎవరైనా ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలి.

- డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టరు, డీఆర్‌డీఏ

చెరువులకు సాగునీరు విడుదల

బి.కోడూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి బి.కోడూరు మండలంలోని 36 చెరువులను నింపుతూ బద్వేలు పెద్ద చెరువుకు శనివారం టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నీటిసంఘాల చైర్మన్‌ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారని, అత్యవసర చెరువులకు సాగునీరు అందించేందుకు జీవోలతో సంబంధం లేకుండా నీటిని విడుదల చేయాలని చెప్పారని, కావున బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల పెద్ద చెరువు, బద్వేలు పెద్ద చెరువులతో పాటు బి.కోడూరు మండలంలోని 36 చెరువులను నింపి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వంలో రూ.70 కోట్ల నిధుల లోయరు సగిలేరు ప్రాజెక్టుకు మంజూరైతే కేవలం ఎల్ఎస్‌పీ డ్యాం నుంచి బద్వేలు పెద్ద చెరువు వరకు కాల్వ మట్టి పని మాత్రమే చేసి బిల్లులు స్వాహా చేశారని ఆరోపించారు. కనీసం చెరువులకు షట్టర్లు కూడా బిగించలేదని, వారందరిపై అధికారులు చర్యలు తీసుకుని పనులు వేగవంతం చేస్తే రైతులకు మేలు చేసిన వారమవుతామన్నారు. అలాగే బద్వేలు పెద్దచెరువు నుంచి ఎల్ఎస్‌పీ డ్యాం వరకు కాల్వకు లైనింగ్ పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. అలాగే ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఈగ రమణారెడ్డి మాట్లాడుతూ బద్వేలు పెద్దచెరువుకు త్వరగా సాగునీరు అందించాలంటే పోరుమామిళ్ల చెరువు నుంచి గుండంరాజపల్లె బ్రాంచ్ కెనాల్ ద్వారా సులభతరమవుతుందని తెలిపారు. బద్వేలు ప్రాంత ప్రజలకు సాగునీరు పూర్తిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మేకవారిపల్లె, మున్నెల్లి నీటిసంఘం చైర్మన్‌లు వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకరటమణరెడ్డి, గోడి రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు భాస్కరరెడ్డి, పవన్, సర్పంచ్ గురయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఎస్‌పీ నుంచి నీటిని విడుదల చేస్తున్న రితీష్‌కుమార్‌రెడ్డి.. కాలువలో పారుతున్న నీరు

ఉపాధి హామీ పీడీపై చర్యలు తీసుకోవాలి

- ఫీల్డు అసిస్టెంట్ల ఫిర్యాదు

కడప మారుతీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులకు గురి చేస్తున్న ఉపాధి హామీపథకం పీడీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శివ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 ఏళ్లుగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రజలు వలసలు పోకుండా వారికి ఉపాధి కల్పిస్తూ పథకాన్ని సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అటు కూలీలు, ఇటు అధికారులకు వారధిగా ఉంటూ చాలీచాలని వేతనాలతో జీవనాన్ని సాగదీస్తున్నామన్నారు. ప్రస్తుత పీడీ తమను అన్యాయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌కార్డులను నెపంగా చూపి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం బాధాకరమన్నారు. ఈ విషయంగా కలెక్టరు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు చెన్నక్రిష్ణారెడ్డి, బయారెడ్డి, వెంకటసుబ్బమ్మ, సుదర్శన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

వెల్లాల చెన్నకేశవుడికి
శంకుచక్ర తిరునామాలు


శంకుచక్ర తిరునామాలను అందిస్తున్న దృశ్యం

రాజుపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నకేశవ సంజీవరాయ స్వామివారికి శంకుచక్ర తిరునామాలను పెద్దముడియం మండలం పెద్దపసుపులకు చెందిన కిశోర్‌రెడ్డి శనివారం దేవస్థానానికి అందించారు. సుమారు రూ.లక్ష విలువ చేసే ఈ శంకు చక్ర తిరునామాలను రెండు జతలు తయారు చేసి భక్తిశ్రద్ధలతో వెల్లాల దేవస్థానానికి అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రమణ దాతకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అలాగే చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరళాలు అందించారు. రాజేపాలెం మండలం గోపాయపల్లెకు చెందిన సుంకు విశ్వనాథరెడ్డి రూ.లక్ష, అదే గ్రామానికి చెందిన దుద్యాల ఆదినారాయణరెడ్డి రూ.25వేలు, గంగిరెడ్డి రామక్రిష్ణారెడ్డి రూ.25వేలు, నంద్యాలకు చెందిన కందూరి సాంబమూర్తి రూ.లక్ష, ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన బి.సుబ్బమ్మ రూ.50వేలు అందించారు. అనంతరం దాతలను స్వామివారి శేష వస్త్రం, మెమెంటోతో ఆలయ సిబ్బంది సత్కరించారు. శ్రావణమాసం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సంజీరవరాయ గ్రామోత్సవం భక్త జనం సంకీర్తనల మధ్య వైభవంగా సాగింది.

8 మంది జూదరుల అరెస్టు

వీరబల్లి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడికోట పంచాయతీ తువ్వ హరిజనవాడ సమీపంలో కంపచెట్ల మధ్య జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. వారి వద్ద రూ.4,370 స్వాధీనం చేసుకు న్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళపై దాడి.. ఏడుగురిపై కేసు

కొండాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎంఆర్ కాలనీలో రాధ అనే మహిళపై దాడి చేసినందుకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. డబ్బుల విషయంలో రంగస్వామి మరో ఆరుగురితో కలిసి దూషించి, దాడి చేసినట్లు రాధ, ఆమె భర్త ప్రతాప్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఆగని 'కుర్చీ' గోల

- అధికారులపై రుసరుసలు హేయం..
- రెవెన్యూ అధికారులు
- స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాం..
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు




(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కుర్చీ విషయమై ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారుల మధ్య మొదలైన వివాదం కొనసాగుతోంది. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌పట్ల కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రవర్తన జిల్లాకే అవమానకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ నాయకులు, వైఎస్సార్ కడప జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ కడప జిల్లా నాయకులు చంద్రశేఖర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డి పేర్లను నేరుగా చెప్పకుండా పరోక్షంగా ప్రస్తావించారు. ఈ ఘటనపై కలెక్టరు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాగా.. "ప్రోటోకాల్ విషయంలో ఎమ్మెల్యే రాష్ట్ర ప్రధాన కార్యదర్శికంటే ఎగువస్థానంలో ఉంటారు. ఇది రెవెన్యూ సంఘం తెలుసుకోవాలి. అధికారులకే హక్కులు ఉండవు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కూడా హక్కులుంటాయి. ఎమ్మెల్యే మాధవిపై తప్పుడు కథనాలతో పత్రికా ప్రకటనలు ఇవ్వడాన్ని మేం ఖండిస్తూ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి స్పీకరుకు ఫిర్యాదు చేయనున్నాం" అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మాత్రమే ప్రజాసేవకులు కాదు. ప్రజల చేత ఎన్నుకోబడిన విషయాన్ని రెవెన్యూ సంఘం గుర్తించాలని తెలిపారు. అక్కడ జరిగేది అధికారుల గెట్ టు గెదర్ లేదా వారి కుటుంబ సభ్యుల కార్యక్రమం కాదని పేర్కొన్నారు.



రాజంపేటలో కల్యాణ వేదికపై వేణుగోపాలస్వామి



సుండుపల్లె: కల్యాణం చేస్తున్న వేదపండితులు



రైల్వే కోడూరు వేణుగోపాల స్వామి ఆలయంలో..



నయన మోహనా.. కృష్ణా.. నీరజేక్షణా..!

● వాడవాడలా.. భక్తిశ్రద్ధలతో గోకులాష్టమి వేడుకలు

రాజంపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా శనివారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణి, సత్యభామతో వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా ఉత్సవ మూర్తులను పట్టు వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ పురోహితుడు రాజేంద్రన్, నాగేశ్వరస్వామి నేతృత్వంలో కల్యాణం నిర్వహించారు.

సుండుపల్లె: చిన్నబిడికీలోని శ్రీరామ్‌బాలాజీ ఆలయంలో ఉదయం వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రంచిన్నబిడికి, వాయలొడ్డు పల్లెల్లో ఊరేగింపు నిర్వహించారు.

రామాపురం: మండల కేంద్రంలోని హరిహరాలయంలో శ్రీకృష్ణుని పటాలకు పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. చెక్కభజనలు చేశారు. కీర్తనలు ఆలపించారు. జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు వీరారెడ్డి, రామాపురం మండల వీహెచ్‌పీ అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, వీహెచ్‌పీ సభ్యుడు ప్రసాద్‌రెడ్డి, దామోదర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, సాయిబాబా, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: స్థానిక వేణుగోపాలనగర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ తాలూరు వెంకటరమణయ్య యాదవ్, సభ్యులు బత్రు వెంకటయ్య, మించెల శంకరయ్య, మించెల వెంకటయ్య, బచ్చు కృష్ణయ్య, బత్తిన గంగయ్య యాదవ్, పాలా నరసింహులు యాదవ్, ఇరగబోయిన నాగేశ్వరరావు యాదవ్, తుమ్మల గురుశంకర్‌యాదవ్‌ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేలాది మంది భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

సిద్దవటం: స్థానిక రాధాకృష్ణ మందిరంలో రాధాకృష్ణుల కు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు

పుల్లంపేట: మండల పరిదిలోని రామసముద్రం పంచాయతీలోని శ్రీకృష్ణ మందిరంలో రుక్మిణి సత్యభామతో కృష్ణుడి కల్యాణం నిర్వ హించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

పెనగలూరు: జెట్టివారిపల్లె నాగలేశు గుట్టపైన ఉన్న నారాయణ ఆశ్రమంలో పూజలు చేశారు. పెనగలూరులో వేణుగోపాలస్వామి దేవాలయం, ఈటమాపురం, కొండూరు హరి జన వాడల్లోని వేణుగోపాలుని దేవాలయాల్లో పూజలు చేశారు. చిన్నారులకు బాలకృష్ణ, చిన్నికృష్ణ గొల్లభామ వేషాలు వేయించారు.

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని వై.కోట గ్రామ పంచాయతీలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి సందర్భంగా గ్రామస్థుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోమాలు, పూజలు చేశారు. పారిశ్రామికవేత్త దూడల సుధాకర్‌యాదవ్ హాజరయ్యారు. సాయంత్రం గ్రామంలో ఊరేగింపు, శ్రీకృష్ణ వేషధారుల నృత్య ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

చిట్వేలి: చిల్లావాండ్లపల్లెలో కల్యాణం నిర్వహించారు. రాత్రికి అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో పిల్లలకు కృష్ణునిలా అలంకరించి సంబరాలు చేసుకున్నారు.

రాయచోటి టౌన్ : పట్టణ పరిధిలోని అర్చన విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యాజమాన్యంతోపాటు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడు: గాలివీడు పంచాయతీ అరవీటివాండ్లపల్లె శ్రీకృష్ణ ఆలయంలో పూజలు నిర్వహించారు. కొంత మంది ప్రజలు చిన్నపిల్లలకు కృష్ణుని వేషధారణతో అలంకరించారు.

సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజలకు సూచించారు. శనివారం బోరెడ్డిగారిపల్లెలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి వెంటనే సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. చిన్నమండెం టౌన్‌లో టీడీపీ కార్యకర్త ముల్లంగి నవీన్ తండ్రి ముల్లంగి సుబ్బరాజా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు.

రాయచోటిటౌన్: శ్రావణ శనివారం సందర్భంగా మండల పరిధిలోని దిగువ అబ్బవరం కమ్మపల్లెకు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మంత్రి పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్య నాయుడు, మట్లి సర్పంచ్ నాగా ర్జునాచారి, బీజేపీ యువమోర్చా నాయకుడు రేపన శివప్రసాద్, తెలుగు యువత నాయకులు గుదే మల్లికార్జుననాయుడు, గ్రామ నాయకులు ఆంజనేయులు నాయుడు, రామచంద్ర, డీలర్ గంగయ్య, శ్రీనివాసులునాయుడు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దిగువ అబ్బవరం ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం: చిట్లూరు గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఖాదర్‌బాషా, సరస్వతిపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు సురేంద్రారెడ్డి, టీడీపీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, సహదేవరెడ్డి, హరినాథరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, రామకృష్ణగౌడ్, ఎంఎల్ వెంకట్రామిరెడ్డి, దర్బార్, వెంకట్రమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగినులకు 'ఉచిత బస్సు'పై ఉపాధ్యాయుల హర్షం

● మంత్రి మండిపల్లికి ఎన్‌టీఏ నేతల సన్మానం

రాయచోటి టౌన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగినులకు కూడా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు శ్రీనివాసరాజు, అసోసియేషన్ నేతలతో కలిసి శనివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం ఉద్యోగినులకు కూడా వర్తింపజేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న యాప్‌ల సమస్యలు, 2025 సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ ఉత్తర్వులు పొంది, రిలీవర్ రాకపోవడంతో రిలీవ్‌కాని ఉపాధ్యాయుల స్థానాల్లో డీఎస్సీ ఉపాధ్యాయులను నియమించి వారికి న్యాయం చేసే ందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్‌తో చర్చించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు మడితాటి నరసింహారెడ్డి, బచ్చల శ్రీనివాసులు, కొండూరు మురళీమోహన్‌రాజు, వంగిమళ్ల వేణుగోపాలరావు, కదిరి హరినాథ్, చిన్నరెడ్డెయ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికోసం మహిళల ఇక్కట్లు

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : గత ఐదు రోజులుగా తాగునీరు రావడం లేదందటూ సంటిగారిపల్లె ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు శనివారం ఖాళీ బిందెలతోనిరసన వ్యక్తం చేశారు. ఐదు రోజులుగా తాగునీరు అందకపోవడంతో వ్యవసాయ బావులవద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరీ కరీముల్లా మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

అనాథ వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ మండలంలోని భాకరాపేట సమీపంలో హైవే పక్కన పడి ఉన్న 85 వృద్ధురాలిని పోలీసులు రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గత శనివారం మృతి చెందింది. వారం రోజులైనా ఆమెను ఎవరూ గుర్తించక పోవడంతో శనివారం కడప కాశీవిశ్వనాథ సేవాసమితి సంస్థ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం కానిస్టేబుల్ శివప్రసాద్, కాశీవిశ్వనాథ సేవాసమితి సభ్యులు, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండకొండ రవి, పురుషోత్తం, సురేష్ మధు తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయికి నివాళి



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

రాజంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : విప్లవాత్మక నిర్ణయాలతో దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన నేత మాజీ ప్రధాని అటల్‌బిహారి వాజ్‌పేయి అని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ తెలిపారు. శనివారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారత్ ఒక శక్తివంతమైన దేశంగా గుర్తించేలా చేసిన మహానేత అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షుడు రమణయ్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, ఉపాధ్యక్షురాలు సునీత, కోడూరు అసెంబ్లి కన్వీనర్ శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేయాలి

● అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత ● నల్ల బ్యాడ్జీలతో నిరసన

సుండుపల్లె, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్ సాధిక్‌అలీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంఆర్‌పీఎస్ గౌరవాధ్యక్షుడు వీరనాగయ్య ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సుండుపల్లె మండల కేంద్రంలో జరుగుతున్న ర్యాలీని అడ్డుకోవడంతోపాటు ప్రశ్నించిన విలేకరిని బెదిరించడం నేరం అన్నారు. ఇలాంటి వ్యక్తులు పోలీసు వ్యవస్థకే చెడ్డపేరు తెస్తున్నారన్నారు. హెడ్‌కానిస్టేబుల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు నాగేశ్వర, మండల ఉపాధ్యక్షుడు గడ్డం నాగలేసు, ఎంఎస్పీ మండల నాయకులు గొల్లపల్లి నాగరాజు, గడ్డంబాబు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాపురం, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి గ్రామ పంచాయతీ ఎగువ హరిజనవాడకు చెందిన రేణిమణి చిన్నప్ప (56) ఇటీవల బావిలో పడి మరణించిన విషయం తెలిసిందే. దీంతో రైతు చాంద్‌బాషా, ఆ గ్రామ టీడీపీ నాయకులు తాతిరెడ్డి ప్రదీప్‌రెడ్డి, నందలూరు రామాంజుల్‌రెడ్డి, కల్లూరు సుభాన్ సాబ్ శనివారం మృతుడి భార్య ఓబులమ్మకు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

పుల్లంపేట/పెనగలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా చికిత్స పొందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శనివారం బాధితుల ఇంటివద్దకు వెళ్లి పంపిణీ చేశారు. మండలంలోని కేతరాజుపల్లెకు చెందిన లచ్చమ్మకు రూ.1.50 లక్షలు, చొప్పావారిపల్లెకు చెందిన పోలి నాగమ్మకు రూ.90,266, పుల్లారెడ్డిపల్లెకు చెందిన ఆదిమూలం లక్ష్మీదేవికి రూ.26,218, బావికాడపల్లెకు చెందిన కామి నేని లక్ష్మయ్యకు రూ.1,18,280 చెక్కులను అందజేశారు. పెనగలూరు మండలం అప్పారావుపేటకు చెందిన కొల్లా రామాంజుల నాయుడుక రూ. 51,301 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ చిన్నం శివయ్య, వెంకటసుబ్బయ్య యాదవ్, మారోతు మల్లి, దాసరి దామోదర్‌నాయుడు, కె.సుదర్శన్‌చౌదరి, కె.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పరిసరాల శుభ్రత మన బాధ్యత

సుండుపల్లె, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని మానవత మండల ఛైర్మన్ గంగిరెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రం వద్ద మానవత ఆధ్వర్యంలో చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పరిసరాలు బాగుంటేనే మనమందరం బాగుంటామని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం తొలగించిన చెత్తాచెదారాన్ని ఊరి బయటకు తరలించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షులు లక్ష్మయ్య, హరికుమార్, అమ్మునాయక్, నరసింహ, నాగేశ్వర, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌ఏ అమృతవాణికి గవర్నర్ ప్రశంసలు

నందలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అరవపల్లె సబ్ సెంటర్ ఎంపీహెచ్‌ఏ అమృతవాణిని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ఎట్‌హోం కార్యక్రమానికి ఆహ్వానించి ప్రశంసించారు. ఈ సందర్భంగా అమృతవాణి మాట్లాడుతూ డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్ తన తోటి సిబ్బంది సహకారంతోనే ఈ మేరకు సేవలందించానని, ఈ గౌరవం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి దక్కుతుందని ఆనందం వ్యక్తం చేశారు.



ఎట్‌హోం కార్యక్రమంలో అమృతవాణి

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

నందలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్‌గౌతు లచ్చన్న 116వ జయంతి సందర్భంగా శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నందలూరులో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్ మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ భారత దేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ గౌరవం పొందిన ఏకైక వ్యక్తి గౌతు లచ్చన్న అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్ వారికి కంటిలో నలుసు గా తయారై, అనేక పర్యాయాలు జైలుకెళ్లారని వివరించారు. ఆయన జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించామన్నారు



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

రాయచోటిటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకుడు షేక్. అతావుల్లా, హిబా బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు మయాన పఠాన్ మహమ్మద్‌అలీ పిలుపు నిచ్చారు. పట్టణంలోని కొత్తపల్లికి చెందిన ఆయేషా అనే గర్భిణికి ఓ నెగెటివ్ రక్తం అత్యవసరమని డాక్టర్లు తెలపగా శ్రీదీప రక్తదానం చేశారు. రిజ్వాన్ అనే యువకుడు బీ పాజిటివ్ రక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో సాహిల్ పఠాన్, నరేశ్, శోభ, అమ్ములు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకుడు

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

రాయచోటిటౌన్, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని గాలివీడు రోడ్డులో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన గంగమ్మ ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సుగవాసి పాలకొండ్రాయుడు కుమార్తె, అల్లుడు కదిరి రేవతి, కదిరి ఉదయ్‌భాస్కర్ పాలొన్నారు. సాయంత్రం ప్రదోష కాల పూజలు జపాలు, దీక్ష హోమాలు చేసి మంగళహారతులు ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు పర్యవేక్షించారు.

కట్టారు.. వదిలేశారు

- నిరుపయోగంగా రూ.2.68 కోట్ల భవనాలు
- పంచాయతీపై నెలకు అద్దెభారం రూ.60 వేలు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సచివాలయ భవనాలు
- పట్టించుకోని అధికారులు

కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సచివాలయ భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. అరకొర వసతుల నడుమ అద్దె భవనాల్లో సచివాలయాలు నడుపుతున్నారు. పర్యవసానంగా పీలేరు మేజర్ గ్రామ పంచాయతీపై నెలకు రూ.60 వేల అద్దె భారం పడుతోంది.

పీలేరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పీలేరు పట్టణంలో ఐదు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఒకటవ సచివాలయం పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంది. ఇదొక్కటే సొంత భవనంలో ఉంది. ఇందిరానగర్, జేకేనగర్, కడప రోడ్, కోటపల్లె మార్గంలో ఉన్న నాలుగు సచివాలయాలు అద్దెభవనాల్లో నిర్వహిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రూ.45 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.22 లక్షలు మంజూరు చేశారు. పీలేరు పట్టణంలో నాలుగు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణం కోసం రూ.2.68 కోట్లు మంజూరయ్యాయి. క్రాంట్రాక్టులు దక్కించుకున్న నాలుగు సచివాలయాలకు గాను మూడింటి నిర్మాణం పూర్తిచేశారు. ఒక్కటి మాత్రం అర్థంతరంగా ఆగిపోయింది.
పీలేరు పట్టణం కామాటంవారిపల్లె వద్ద సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రాలు పూర్తి స్థాయిలో నిర్మించారు. కాగా ఇందిరానగర్‌లో సచివాలయాన్ని తమ స్థలంలో నిర్మించారంటూ బాలికల ఉన్నత పాఠశాల కోర్టుకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకుంది. అధికారుల అత్యుత్సాహం కారణంగానే నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాన్ని పాఠశాలకు అప్పగించాల్సి వచ్చిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ రైతు భరోసా కేంద్ర నిర్మాణం సైతం సగంలో ఆగిపోయింది. పట్టణ నడిబొడ్డున ఉన్న సీఎల్ఆర్‌సీ కార్యాలయ సమీపంలో ఒక సచివాలయం, రైతుభరోసా కేంద్ర నిర్మాణం పూర్తి కాగా, మరో సచివాలయం, రైతు భరోసా కేంద్ర నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పీలేరు పంచాయతీ అధికారులు నిర్మాణం పూర్తయిన భవనాలను స్వాధీనం చేసుకున్నా ప్రారంభించడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో నాలుగు సచివాలయాల అద్దె భారం పంచాయతీపై పడుతోంది. దీనికి తోడు నిర్మాణం పూర్తయిన భవనాలను వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన భవనాలను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.


నిర్మాణం పూర్తయ్యాక ఇందిరాగనర్ బాలికోన్నత పాఠశాల స్వాధీనం చేసుకున్న సచివాలయ భవనం



సీఎల్ఆర్‌సీ కార్యాలయం వద్ద నిర్మాణం పూర్తయిన సచివాలయ భవనం - ప్రారంభానికి సిద్ధంగా రైతు భరోసా కేంద్రం

త్వరలోనే ప్రారంభిస్తాం
- లతీఫ్ ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు



చిన్నిచిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. అన్ని పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా సచివాలయ కొత్త భవనాలను ప్రారంభిస్తాం. పంచాయతీపై నెలనెలా మోయలేని అద్దె భారం పడుతోంది. నిర్మాణం పూర్తయిన భవనాలను పంచాయతీ స్వాధీనం చేసుకుంటుంది. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లతో సంప్రదించి పంచాయతీ ఆధీనంలోకి తీసుకుంటాం.

పశు వైద్యాధికారికి రాష్ట్ర స్థాయి
ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకొంటున్న డాక్టర్ సురేశ్

నిమ్మనపల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశు సంవర్ధక శాఖలో పశు వైద్యులుగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ సురేశ్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి అత్యధికంగా పెయ్యదూడల కృత్రిమ గర్భధారణ ప్రోత్సహించినందుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా గుంటూరులో జరిగిన సమావేశంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు నుంచి అవార్డు అందుకున్నానని తెలిపారు. అయితే ఇదే ఏడాదిలో 780 పెయ్యదూడలకు కృత్రిమ గర్భధారణను ప్రోత్సహించామని దీని ద్వారా 90 శాతం ఆవులలో ఎలాంటి సమస్య లేకుండా పెయ్యదూడలు మాత్రమే పుడతాయని తెలిపారు. గత ప్రభుత్వంలో కృత్రిమ గర్భధారణకు ఉపయోగించే సూదిమందు రూ.500 ఉండగా ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దానిని రూ.150కే ఇస్తోందని తెలిపారు. దీంతో అధిక శాతం పాడి రైతులు పెయ్యదూడల సూది కొరకు ముందుకు వస్తున్నట్లు తెలిపారు.

కోళ్లబైలులో ఆక్రమణలు తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లబైలు గ్రామం, అమ్మచెరువు మిట్టలో శనివారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఇందులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డి తన సిబ్బందితో వెళ్లి అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల పరిధిలో అక్రమ కట్టడాలు, నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు తొలగించి చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోళ్లబైలులో పలు చోట్ల పునాదులను, కట్టడాలను పరిశీలించారు. ఇందులో ఆర్ఐ బాలసుబ్రహ్మణ్యం, మండల సర్వేయర్ సుబ్రమణ్యం, వీర్వోలు పాల్గొన్నారు.

జాతీయ జెండాతో ర్యాలీ నేరమా?

హెడ్ కానిస్టేబుల్‌పై కూటమి నాయకుల ఫిర్యాదు


ఎస్ఐకు ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

సుండుపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం రోజు జాతీయ జెండాతో ర్యాలీ పట్టుకోవాలంటే అనుమతులు తీసుకోవాలా అని బీజేపీ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జనసేన సీనియర్ నాయకుడు రామాశ్రీనివాసులు ప్రశ్నించారు. శుక్రవారం ర్యాలీని అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ సాదక్‌అలీ తీరును తీవ్రంగా ఖండించారు.
హర్ ఘర్ తిరంగా పేరుతో దేశ ప్రధాని నరేంద్రమోదీ ఊరూవాడా ర్యాలీలు నిర్వహించి దేశఖ్యాతిని చాటుతుంటే జెండాకు సెల్యూట్ కొట్టాల్సిన హెడ్ కానిస్టేబుల్ ర్యాలీని అడ్డుకొని అనుమతులు ఉన్నాయా అని అడగడం సిగ్గుచేటన్నారు. అలాంటి వ్యక్తిని విధుల నుంచి తొలగించి కేసు నమోదు చేయాలని సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రమణ గౌడ్, జనసేన సీనియర్ నాయకులు రామా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఎర్రంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచరాయుడు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిచర్ల శంకరయ్య, ఉపాధ్యక్షులు రెడ్డెయ్యఆచారి, గాలి భాస్కర్, సుధాకర్, చంద్రమోహన్, శ్రీనివాసరాజు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో చేపల వేటకు వెళ్లొద్దు : సీఐ


సిద్దవటంలోని పెన్నానది వద్ద సీఐ బాబు

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్నానదిలో నీటి ప్రవాహం రోజురోజుకు పెరుగుతోందని, మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్లవద్దని ఒంటిమిట్ట సీఐ బాబు తెలిపారు. శనివారం ఆయన సిద్దవటం వద్ద పెన్నానదిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల పెన్నానదిలో నీటి ఉధృతి పెరుగుతోందని ప్రజలతో పాటు సందర్శకులు ఎవరూ నదిలో దిగవద్దని తెలిపారు. లోలెవల్ లోకాజ్‌వే వద్ద ఎవరైనా సంచరిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పెన్నానదిలో నీటి మట్టం తగ్గేవరకు ఇద్దరు పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, పెన్నానది వద్ద ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం తెలపాలని మండల వాసులకు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీటీఎం గ్రామం, రైల్వే బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. శనివారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తాలుకా పోలీసులకు సమాచారం అందించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ మృతదేహాన్ని పరిశీలించి కదిరి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి గుర్తుతెలియని యువకుడిగా నిర్ధారించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని కదిరి రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని కదిరికి తరలించినట్లు తెలిపారు.

హిల్స్‌లో సందడే.. సందడి

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండల పరిధిలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ శనివారం పర్యాటకులతో కిటకిటలాడింది. సహజంగా వారాంతంలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. దానికి తోడు కృష్ణాష్టమి నేపథ్యంలో వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో హార్సిలీహిల్స్‌కు పర్యాటకులు పోటెత్తారు. కుటుంబ సమేతంగా హిల్స్‌కు చేరుకొని ఉల్లాసంగా గడిపారు. గాలిబండ, పాత, కొత్త వ్యూపాయింట్స్, అటవీశాఖ ప్రాంగణంలో కలియతిరుగుతూ, మానస సరోవరంలో బోటింగ్ చేస్తూ సరదాగా గడిపారు. సముద్రమట్టానికి 4212 అడుగుల ఎత్తులో చల్లని, ఆహ్లాదకర వాతావరణంలో కలిగే సరికొత్త అనుభూతిని ఆస్వాదిస్తూ తన్మయత్వం చెందారు. పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలిరావడంతో ఏపీ టూరిజం, అటవీ సముదాయంతో పాటు ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లు పూర్తిగా నిండిపోయాయి.


మానస సరోవరంలో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

విషపురుగు కాటుకు రైతు మృతి


వెంకటయ్య మృతదేహం

సిద్దవటం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నీరు కట్టేందుకు పొలానికి వెళితే విషపురుగు కుట్టడంతో రైతు వెంకటయ్య (40) మృతి చెందాడు. మండలంలోని వెలుగుపల్లె గ్రామానికి చెందిన వెంకటయ్య గ్రామానికి పడమటి భాగంలో ఉన్న తన పొలంలో వరి పంట సాగు చేశాడు. శనివారం ఉదయం పొలానికి నీరు కట్టేందుకు ఉదయం 6 గంటలకు పొలంలోకి వెళ్లాడు. పొలానికి నీరు కడుతుండగా విషపురుగు కుట్టడంతో పొలం పక్కనే ఉన్న రైతు వెంగయ్యకు చెప్పడంతో ద్విచక్ర వాహనంలో భాకరాపేట గ్రామంలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యసేవల కోసం కడప రిమ్స్‌కు ఆటోలో తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. వెంకటయ్య భార్య వెంకటసుబ్బమ్మ, కుమార్తె ఉన్నారు. పంటల ఖర్చుల నిమిత్తం సుమారు రూ.2 లక్షలు పైబడి అప్పు చేశాడని, రాష్ట్ర ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడవి భార్య కన్నీటిపర్యంతమైంది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్లు ఏఎస్ఐ సుబ్బరామచంద్ర తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ రవి

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవి వ్యాపారులకు తెలిపారు. ఆయన మార్కెట్ పరిసర ప్రాంతాలను శనివారం పరిశీలించారు. వ్యాపారులతోకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడానికి చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని వ్యాపారులను హెచ్చరించారు. ప్రజలు మార్కెట్‌కు వచ్చేటప్పుడు విధిగా గుడ్డ సంచి లేదా జూట్ బ్యాగ్ వెంట తెచ్చుకోవాలని తెలియజేశారు. పట్టణ పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ తమవంతు సహకరించాలని ప్రజలకు వివరించారు. రాయచోటి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా చేయడానికి ప్రజల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వాడరాదని తెలియజేశారు. మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా లేకపోతే రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఆ..రెండూ అందని ద్రాక్షేనా...?

- ఆర్టీసీ డిపో అదిగో..ఇదిగో మాటలకే సరి...
- డిగ్రీ కాలేజీదీ.. అదే తీరు...
- దశాబ్దాలుగా ఊరిస్తున్న ఆ రెండూ...


ఇళ్లకు వెళ్లేందుకు బస్సులు లేక వేచి ఉన్న విద్యార్థులు

బి.కొత్తకోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణం తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రధానమైనది. జనాభా 40 వేలకు పైనే. పొరుగు మండలాలైన పీటీఎం, ములకలచెరువులతో పాటు సరిహద్దు కర్ణాటక గ్రామాల ప్రజలతో కనెక్టివిటీతో చాలా రద్దీగా ఉండే పట్టణం. మేజర్ పంచాయతీగా ఉంటూ నగర పంచాయతీగా ప్రమోట్ అయిన పట్టణం. బి.కొత్తకోట నుంచి మదనపల్లి, కదిరితో పాటు కర్ణాటక రాజధాని బెంగళూరు వైపు వందలమంది ప్రయాణాలు సాగిస్తుంటారు. అదే విధంగా పొరుగు మండలాలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ఎల్‌కేజీ నుంచి డిగ్రీ వరకు చదువుకునేందుకు, రైతులు కొనుగోళ్లు, అమ్మకాలకు నిత్యం బి.కొత్తకోటకు వచ్చి తీరాల్సిందే. ఇలాంటి ప్రధాన పట్టణానికి తలమానికంగా ఉన్న ఆర్టీసీ డిపో రద్దు చేసి దశాబ్దం దాటింది. డిగ్రీ కాలేజి వచ్చేస్తోందంటూ పాలకులు నమ్మబలికి దశాబ్దం కావస్తోంది. ఈ రెండింటిపై ఆశలు వదులుకోలేక బి.కొత్తకోట ప్రజానీకంతో పాటు ఈ పట్టణంతో కనెక్టివిటీ ఉన్న 300 గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

డిగ్రీ కాలేజి వచ్చేసిందంటూ మాయమాటలు..

బి.కొత్తకోటకు అత్యవసరమైన వాటిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఒకటి. కొత్తకోట నుంచే కాకుండా పీటీఎం, ములకలచెరువు మండలాల నుంచి వందల సంఖ్యలో డిగ్రీ విద్యార్థులు బి.కొత్తకోటలో చదువుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజి లేక ప్రైవేటు కాలేజిలలో చేరారు. వీరి నుంచి ఓ వైపు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో మరోవైపు ప్రైవేటు కాలేజిల యాజమాన్యాలు దోచేస్తున్నాయి. పట్టణంలో మూడు ప్రైవేటు డిగ్రీ కాలేజిలు ఉండగా అధికారులు సైతం వీరికి సహకరిస్తున్నారు. డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయండి అని ప్రజాసంఘాలు, విద్యార్థుల తల్లితండ్రులు మొరపెట్టుకుంటున్నా ఆలకించే నాయకులు కరువయ్యారు. డిగ్రీ కాలేజి ఏర్పాటుకు కొన్నిసార్లు ప్రయత్నాలు జరిగినా అందులో చిత్తశుద్ధి లోపించి అర్ధంతరంగా ఆగిపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి 2013లో బి.కొత్తకోటలోనే జరిగిన బహిరంగసభలో డిగ్రీ కాలేజి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. బెంగళూరు రోడ్డులో శంకరయ్యస్వామి ట్రస్ట్ భూమిలో నూతన నిర్మాణం అన్నారు. అమలు కాలేదు. మరోసారి స్థానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజి భవనాలలో తాత్కాలికంగా డిగ్రీ తరగతులు సైతం ప్రారంభిస్తామని చెప్పినా అదీ జరగలేదు.

కలగా మారిన ఆర్టీసీ డిపో

బి.కొత్తకోట పట్టణానికి అభివృద్ధి పరంగా ఆర్టీసీ డిపో కీలకమైంది. మదనపల్లె ఎమ్మెల్యేగా ఉన్న ఆవుల మోహన్‌రెడ్డి ఆర్టీసీ డిపోను తెచ్చారు. 2006 డిసెంబరు 31న అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 14 డిపోలను రద్దు చేశారు. అందులో బి.కొత్తకోట ఒకటి. వాటిలో స్థానిక ప్రజాప్రతినిధుల కృషితో అంచెలంచెలుగా 13 డిపోలు మళ్లీ ప్రారంభమవ్వగా బి.కొత్తకోటకు మాత్రం దిక్కులేకుండా పోయింది. డిపో సాధన కోసం ప్రజాసంఘాలు, స్థానిక నాయకుల కృషి ఫలించలేదు. అప్పటి నుంచి అధికారంలోకి వచ్చిన పార్టీ, లోకల్ ఎమ్మెల్యే అదిగో..ఇదిగో అనడం తప్ప కార్యరూపం దాల్చింది లేదు. ఒకటికి రెండుసార్లు స్థలాలు ఎంపిక చేయడం, బి.కొత్తకోట లోగోతో బస్సులను నడపటం, అధికారులను పిలిపించి హడావిడి చేయడం తప్ప డిపో వచ్చింది లేదు. గతంలో డిపో ఏర్పాటుకు భూమి ఇస్తామన్న పాపానికి ఓ కుటుంబం చిక్కుల్లో పడింది. తాజాగా వైసీపీ హయాం చరమాంకంలో గంగమ్మ మాన్యంలో డిపో ఏర్పాటు చేసేస్తున్నారని, బస్సులు కూడా వచ్చేస్తాయని ప్రచారం మాత్రమే జరిగింది. గ్రామాల నుంచి బి.కొత్తకోటకు రావడానికి, సాయంత్రం తిరిగి వెళ్లడానికి విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.


ఆర్టీసీ డిపో కోసం ఎంపిక చేసిన స్థలంలో నిర్మించిన షెడ్డు

నాయకులు చొరవ చూపాలి..

రాష్ట్రంలో రద్దయిన ఆర్టీసీ డిపోలన్నీ మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక్కడి నాయకులకు సాధించాలన్న పట్టుదల లేకపోగా ఎవరి స్వార్థం వారిది. ప్రజాసమస్యలు, పట్టణ అభివృద్ధిపై అంకితభావం లేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఆర్టీసీ డిపో, డిగ్రీ కాలేజిల సాధనకు అధికార పార్టీ నాయకులు కృషి చేయాలి. ఆ ప్రయత్నాలకు ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుంది.

- మనోహర్‌రెడ్డి, బి.కొత్తకోట

యువతి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న పవిత్ర ఫైల్ ఫొటో

ప్రొద్దుటూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని పాతికేళ్ల యువతి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శనివారం ప్రొద్దుటూరులోని స్వరాజ్యనగర్‌లో చోటు చేసుకుంది. ఆ వివరాల్లోకి వెళితే... ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని స్వరాజ్యనగర్‌కు చెందిన పల్లోలి జయమ్మ, రవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు సౌజన్యకు పెళ్లయింది. రెండో కూతురు పవిత్ర ఎంటెక్ పూర్తి చేసి వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తోంది. దువ్వూరు మండలం ఇడమడక గ్రామానికి చెందిన తన బంధువుల అబ్బాయి ధారా వినోద్‌కుమార్‌ను ప్రేమించింది. వీరి ప్రేమను పవిత్ర తల్లిదండ్రులు అంగీకరించారు. వచ్చే సంవత్సరం పెళ్లి కూడా చేయాలని అనుకున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కాలేజీకి వెళ్లి 10.30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చింది. సాయంత్రం 6 గంటలకు ఇంటిపైన వున్న రేకుల గదికి వెళ్లింది. రాత్రి 8 గంటలు అవుతున్నా కిందికి రాకపోవడంతో తల్లి వెళ్లి ఎంత గట్టిగా తలుపు కొట్టినా పలకకపోవడంతో కిటికిలో నుంచి చూసింది. పవిత్ర చీరతో ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించడంతో జయమ్మ గట్టిగా కేకలు వేసింది. దీంతో జయమ్మ భర్త, పెద్ద కూతురు, చుట్టుపక్కల వారు పైకి వచ్చి తలుపు పగలగొట్టి పవిత్రను కిందకు దించారు. వెంటనే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ సదాశివయ్య కేసు నమోదు చేశారు,

ప్రమాదవశాత్తు కోనేటిలో పడి వ్యక్తి మృతి


క్రిష్ణయ్య మృతదేహం

సింహాద్రిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని భానుకోట శైవ క్షేత్రంలో కటిక పెద్ద క్రిష్ణయ్య(54) శనివారం ప్రమాదవశాత్తు కోనేటిలో పడి మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన క్రిష్ణయ్య భానుకోటకు వెళ్తున్నట్లు భార్య గంగమ్మకు చెప్పి శుక్రవారం ఇంటినుండి వచ్చాడు, తిరిగి రాత్రి ఇంటికి రాకపోవడంతో భార్య గంగమ్మ ఆందోళనకు గురైంది. పోలీసులకు అందిన సమాచారం మేరకు క్రిష్ణయ్య భానుకోటలో ప్రమాదవశాత్తు కోనేటిలో పడినట్లు మృతి చెందినట్లు తెలిసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం


గుండం నుంచి వెలికితీసిన హబీబుల్లా మృతదేహం


హబీబుల్లా ఫైల్‌ఫొటో

అట్లూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని లంకమల క్షేత్రంలో లంకమల్లేశ్వరుని పక్కనే ఉన్న పసుపు గుండంలో ఈత కొడుతూ గల్లంతైన హబీబుల్లా మృతదేహం లభించినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు... శుక్రవారం రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా హబీబుల్లా మృతదేహం లభ్యం కాకపోవడంతో శనివారం ఉదయమే పోలీసు, ఫైర్ సిబ్బంది గుండమంతా గాలించి 30 అడుగుల లోతులో ఉన్న హబీబుల్లా మృతదేహాన్ని మధ్యాహ్నం 3గంటల వరకు శ్రమించి వెలికితీశారని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారని, మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ గాలింపు చర్యల్లో ఫైర్ ఆఫీసరు చంద్రుడు, పోలీసు సిబ్బంది నాగేశ్వర్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రమణ తదితరుల పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

వల్లూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వల్లూరులో శనివారం జరిగిన కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ పొలాల్లో సంచరిస్తూ వల్లూరు గ్రామం చుట్టూ ఉన్న కుక్కలు దాడి చేయడంతో జింక పిల్ల మృతి చెందిందన్నారు. ఈ విషయంపై పోలీసులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. దీంతో చనిపోయిన జింక పిల్లకు పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు.


మృతి చెందిన జింక పిల్ల

మాయరోగం ఫట్




- 7577 పింఛన్ల నిలిపివేత
- కడప పట్టణంలోనే అత్యధికం
- సిద్దవటంలో అత్యల్పం

జిల్లాలో ఉన్న బోగస్ సదరం సర్టిఫికెట్లను వైద్యాధికారులు గుర్తించారు. అంగవైకల్యం ధృవీకరణ కోసం వికలత్వపు పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులకు దశల వారీగా నోటీసులు జారీ చేసి వైద్యపరీక్షలు నిర్వహించారు. కొంతమంది వైద్య పరీక్షలకు హాజరు కాగా మరి కొంతమంది గైర్హాజరయ్యారు. తిరిగి వారికి వైద్య పరీక్షల తేదీని ఖరారు చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఎట్టకేలకు అనర్హులను ప్రభుత్వం గుర్తించింది. దీంతో జిల్లాలో 7577 పింఛన్లను నిలుపుదల చేస్తూ చర్యలు తీసుకుంది. పలు మార్లు పింఛన్ల కోసం మాయ రోగం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో అధికారులు సదరం సర్టిఫికెట్లపై నిఘా ఉంచారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇబ్బడిముబ్బడిగా వైకల్య పింఛన్లు మంజూరయ్యాయి. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో ఉన్న వైకల్య పింఛన్ల కంటే వైసీపీ హయాంలో అత్యధికంగా పెరిగాయి.

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివధ మండలాలకు చెందిన వ్యక్తులు ఇతర జిల్లాల్లో ఉన్న ఆసుపత్రులలో వైకల్య సర్టిఫికేట్ పొందారు. ఈ సర్టిఫికేట్ల ఆధారంగా దివ్యాంగులకు ఇచ్చే పింఛన్లు పొందేవారు. వీటిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలో ముందుగా ఇతర జిల్లాల్లో ఇచ్చిన వికలత్వ సర్టిఫికేట్లను పరిశీలించారు. ఈ పరిశీలనలో అత్యధికంగా వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహించే పులివెందుల నియోజకవర్గంలోనే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు .ఈ మేరకు 232 బోగస్ వైకల్య సర్టిఫికెట్లను రద్దు చేశారు. వీటితో పాటు ఆ తర్వాత చేపట్టిన సర్టిఫికేట్ల నిర్ధారణలో 1087 మందికి నకిలీ సర్టిఫికేట్లుగా గుర్తించడం జరిగింది. వీటిలో అత్యధికంగా పోరుమామిళ్ల మండలంలో 69, కలసపాడులో 68, ఎర్రగుంట్ల 60, ముద్దనూరు 57, కమలాపురం 51, మైదుకూరు 50, తొండూరు 42, పులివెందుల 22, వివిధ మండలాల్లో పదికి పైగానే సదరం సర్టిఫికేట్లను బోగస్‌గా గుర్తించారు. ఈ మేరకు గత ఏడాది సెప్టెంబరు నెలలో వీరి పింఛన్లను రద్దు చేయాలంటూ అప్పటి కలెక్టరు శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మరో 7577 పింఛన్లు రద్దు

ఆ తరువాత చేపట్టిన అంగ వైకల్య ధృవపత్రాల పరిశీలనలో మరో 7577 మంది తమకు ఎలాంటి వికలత్వం లేకున్నప్పటికీ కేవలం పింఛన్ల కోసమే సదరం సర్టిఫికేట్లు పొందారని వైద్యాధికారులు గుర్తించారు. వీరిలో 4581 మందికి 40 శాతం తక్కువ వికలత్వం ఉన్నట్లు, 74 మందికి 45శాతం కంటే ఎక్కువ ఉన్నట్లు గుర్తించారు. ఇక ఇతర అనారోగ్య సమస్యల కారణంగా పొందిన 2022 సర్టిఫికేట్లను నకిలీవిగా అంటే ఎటువంటి వికలత్వం లేకుండా వైద్యాధికారుల నుంచి పొందినటు గుర్తించారు. ఈ క్రమంలో జిల్లాలో మొత్తం 7577పింఛన్లను నిలుపుదల చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికార యంత్రాంగం పేర్కొన్నారు. ఇందులో కడప పట్టణంలో 558 పింఛ్లు రద్దయిన జాబితాలో ఉండగా ఇది అత్యధిక స్థానంలో ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదే విధంగా వేంపల్లె మండలంలో 529, అట్లూరులో 67, బి.కోడూరులో 120, బద్వేలులో 81, బద్వేలు పట్టణ ప్రాంతంలో 115, బి.మఠంలో 127, చక్రాయపేటలో 204, చాపాడులో 210, చెన్నూరు మండలంలో 102, సీకేదిన్నెలో 156, దువ్వూరులో 246, గోపవరంలో 65, జమ్మలమడుగు మండలంలో 86, మున్సిపాలిటీ పరిధిలో 79, కలసపాడులో 117, కమలాపురంలో 227, ఖాజీపేటలో 117, కొండాపురం 301, లింగాల 439, ముద్దనూరులో 297, మైలవరంలో 115, పెద్దముడియం 248, పోరుమామిళ్ల 119, ప్రొద్దుటూరు మండలంలో 221, మున్సిపాలిటీ పరిధిలో 202 బోగస్ పత్రాలున్నట్లు గుర్తించారు. అదేవిధంగా పులివెందులలో 121, మున్సిపాలిటీ ఏరియాలో 748, రాజుపాలెం 89, మైదుకూరులో 133, మున్సిపాలిటీ పరిధిలో 132, కాశినాయన మండలంలో 114, సిద్దవటంలో 50, సింహాద్రిపురంలో 201, తొండూరులో 301, వల్లూరు మండలంలో 86, వీఎన్‌పల్లె మండలంలో 202, వేంపల్లెలో 529, వేములలో 165, ఒంటిమిట్టలో 72, ఎర్రగుంట్లలో 122, మున్సిపాలిటీ పరిధిలో 60 వికలత్వ పింఛన్లను రద్దు చేస్తున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.



ఈనెల నుంచే పింఛన్ల నిలుపుదల..



రద్దయిన వికలత్వ పింఛన్లను ఈ నెల నుంచే నిలుపుదల చేయడం జరుగుతుంది. ఈ జాబితాలో అనర్హులుగా తేలినవారు ఎవరైనా మరోమారు తమ వికలత్వాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఎవరైనా ఉంటే వైద్యాధికారులను సంప్రదించాలి.

- డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టరు, డీఆర్‌డీఏ

చెరువులకు సాగునీరు విడుదల

- లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి మండలంలోని 36 చెరువులకు..



ఎల్ఎస్‌పీ నుంచి నీటిని విడుదల చేస్తున్న రితీష్‌కుమార్‌రెడ్డి.. కాలువలో పారుతున్న నీరు

బి.కోడూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయర్ సగిలేరు ప్రాజెక్టు నుంచి బి.కోడూరు మండలంలోని 36 చెరువులను నింపుతూ బద్వేలు పెద్ద చెరువుకు శనివారం టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నీటిసంఘాల చైర్మన్‌ల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారని, అత్యవసర చెరువులకు సాగునీరు అందించేందుకు జీవోలతో సంబంధం లేకుండా నీటిని విడుదల చేయాలని చెప్పారని, కావున బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల పెద్ద చెరువు, బద్వేలు పెద్ద చెరువులతో పాటు బి.కోడూరు మండలంలోని 36 చెరువులను నింపి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. రైతులు కూడా నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వంలో రూ.70 కోట్ల నిధుల లోయరు సగిలేరు ప్రాజెక్టుకు మంజూరైతే కేవలం ఎల్ఎప్‌సీ డ్యాం నుంచి బద్వేలు పెద్ద చెరువు వరకు కాల్వ మట్టి పని మాత్రమే చేసి బిల్లులు స్వాహా చేశారని ఆరోపించారు. కనీసం చెరువులకు షట్టర్లు కూడా బిగించలేదని, వారందరిపై అధికారులు చర్యలు తీసుకుని పనులు వేగవంతం చేస్తే రైతులకు మేలు చేసిన వారమవుతామన్నారు. అలాగే బద్వేలు పెద్దచెరువు నుంచి ఎల్ఎస్‌పీ డ్యాం వరకు కాల్వకు లైనింగ్ పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. అలాగే ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఈగ రమణారెడ్డి మాట్లాడుతూ బద్వేలు పెద్దచెరువుకు త్వరగా సాగునీరు అందించాలంటే పోరుమామిళ్ల చెరువు నుంచి గుండంరాజపల్లె బ్రాంచ్ కెనాల్ ద్వారా సులభతరమవుతుందని తెలిపారు. బద్వేలు ప్రాంత ప్రజలకు సాగునీరు పూర్తిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, మేకవారిపల్లె, మున్నెల్లి నీటిసంఘం చైర్మన్‌లు వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకరటమణరెడ్డి, గోడి రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు భాస్కరరెడ్డి, పవన్, సర్పంచ్ గురయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పీడీపై చర్యలు తీసుకోవాలి

- ఫీల్డు అసిస్టెంట్ల ఫిర్యాదు

కడప మారుతీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఇబ్బందులకు గురి చేస్తున్న ఉపాధి హామీపథకం పీడీపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జె.శివ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 ఏళ్లగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రజలు వలసలు పోకుండా వారికి ఉపాధి కల్పిస్తూ పథకాన్ని సజావుగా అమలు చేస్తున్నామన్నారు. అటు కూలీలు, ఇటు అధికారులకు వారధిగా ఉంటూ చాలీచాలని వేతనాలతో జీవనాన్ని సాగదీస్తున్నామన్నారు. ప్రస్తుత పీడీ తమను అన్యాయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాబ్‌కార్డులను నెపంగా చూపి ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం బాధాకరమన్నారు. ఈ విషయంగా కలెక్టరు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు చెన్నక్రిష్ణారెడ్డి, బయారెడ్డి, వెంకటసుబ్బమ్మ, సుదర్శన్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

వెల్లాల చెన్నకేశవుడికి శంకుచక్ర తిరునామాలు


శంకుచక్ర తిరునామాలను అందిస్తున్న దృశ్యం

రాజుపాలెం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చెన్నకేశవ సంజీవరాయ స్వామివారికి శంకుచక్ర తిరునామాలను పెద్దముడియం మండలం పెద్దపసుపులకు చెందిన కిశోర్‌రెడ్డి శనివారం దేవస్థానానికి అందించారు. సుమారు రూ.లక్ష విలువ చేసే ఈ శంకు చక్ర తిరునామాలను రెండు జతలు తయారు చేసి భక్తిశ్రద్ధలతో వెల్లాల దేవస్థానానికి అందించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మినారాయణరెడ్డి, రమణ దాతకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అలాగే చెన్నకేశవస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దాతలు విరాళాలు అందించారు. రాజేపాలెం మండలం గోపాయపల్లెకు చెందిన సుంకు విశ్వనాధరెడ్డి రూ.లక్ష, అదే గ్రామానికి చెందిన దుద్యాల ఆదినారాయణరెడ్డి రూ.25వేలు, గంగిరెడ్డి రామక్రిష్ణారెడ్డి రూ.25వేలు, నంద్యాలకు చెందిన కందూరి సాంబమూర్తి రూ.లక్ష, ప్రకాశం జిల్లా కొమరోలుకు చెందిన బి.సుబ్బమ్మ రూ.50 వేలు అందించారు. అనంతరం దాతలను స్వామివారి శేష వస్త్రం, మెమెంటోతో ఆలయ సిబ్బంది సత్కరించారు. శ్రావణమాసం సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి సంజీవరాయ గ్రామోత్సవం భక్త జనం సంకీర్తనల మధ్య వైభవంగా సాగింది.

8 మంది జూదరుల అరెస్టు

వీరబల్లి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గడికోట పంచాయతీ తువ్వ హరిజనవాడ సమీపంలో కంపచెట్ల మధ్య జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరసింహారెడ్డి తెలిపారు. వారి వద్ద రూ.4,370 స్వాధీనం చేసుకు న్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళపై దాడి.. ఏడుగురిపై కేసు

కొండాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎంఆర్ కాలనీలో రాధ అనే మహిళపై దాడి చేసినందుకు పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. డబ్బుల విషయంలో రంగస్వామి మరో ఆరుగురితో కలిసి దూషించి, దాడి చేసినట్లు రాధ, ఆమె భర్త ప్రతాప్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

ఆగని 'కుర్చీ' గోల

- అధికారులపై రుసరుసలు హేయం..
- రెవెన్యూ అధికారులు

- స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తాం..
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు



(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో శుక్రవారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా కుర్చీ విషయమై ఎమ్మెల్యే, రెవెన్యూ అధికారుల మధ్య మొదలైన వివాదం కొనసాగుతోంది. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌పట్ల కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రవర్తన జిల్లాకే అవమానకరమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ నాయకులు, వైఎస్సార్ కడప జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ అసోసియేషన్ కడప జిల్లా నాయకులు చంద్రశేఖర్ శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆర్.మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డి పేర్లను నేరుగా చెప్పకుండా పరోక్షంగా ప్రస్తావించారు. ఈ ఘటనపై కలెక్టరు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కాగా.. "ప్రోటోకాల్ విషయంలో ఎమ్మెల్యే రాష్ట్ర ప్రధాన కార్యదర్శికంటే ఎగువస్థానంలో ఉంటారు. ఇది రెవెన్యూ సంఘం తెలుసుకోవాలి. అధికారులకే హక్కులు ఉండవు. ఎన్నికైన ప్రజాప్రతినిధులకు కూడా హక్కులుంటాయి. ఎమ్మెల్యే మాధవిపై తప్పుడు కథనాలతో పత్రికా ప్రకటనలు ఇవ్వడాన్ని మేం ఖండిస్తూ హక్కుల ఉల్లంఘనకు సంబంధించి స్పీకరుకు ఫిర్యాదు చేయనున్నాం" అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు మాత్రమే ప్రజాసేవకులు కాదు. ప్రజల చేత ఎన్నుకోబడిన విషయాన్ని రెవెన్యూ సంఘం గుర్తించాలని తెలిపారు. అక్కడ జరిగేది అధికారుల గెట్ టు గెదర్ లేదా వారి కుటుంబ సభ్యుల కార్యక్రమం కాదని పేర్కొన్నారు.


మదనపల్లెలో భక్తులతో సందడిగా శ్రీకృష్ణుడి ఆలయం



వేడుకగా జన్మాష్టమి

కృష్ణుడిని దర్శించుకున్న ప్రముఖులు ● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

● వైభవంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం

మదనపల్లె టౌన్/అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వాడవాడలా జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు కృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మరికొన్ని ఆలయాల్లో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పట్టణం, అనపగుట్ట, గోవర్ధనగిరిలోని శ్రీకృష్ణాలయంలో శనివారం జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. రుక్మిణీ, సత్యభామ సమేత కృష్ణుడిని అలంకరించి పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం కన్నుల పండువగా కళ్యాణోత్సవం చేశారు. ఆలయంలో పిల్లల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్నపనోత్సవం తరువాత వసంతోత్సవం జరిపించారు. సాయంత్రం ఉట్లోత్సవంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే షాజహాన్ బాష టీడీపీ నేతలతో కలిసి స్వామివారి పూజలో పాల్గొన్నారు. యాదవులు సంఘటితమై శ్రీకృష్ణ దేవస్థానం నిర్మించుకుని జన్మాష్టమి వేడుకగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని సన్మానించారు. మాజీ ఎమ్మెల్యేలు నవాజ్‌బాషా, దేశాయ్ తిప్పారెడ్డి, పట్టణ ప్రముఖులు, రాజకీయ నేతలు, వ్యాపారవే త్తలు పాల్గొన్నారు. మదనపనల్లె వైసీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్, జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి, మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు జంగాల శివరాం, మల్లయ్య కొండ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి, కురవంక సర్పంచ్ పసుపులేటి చలపతి స్వామి వారిని దర్శించుకు న్నారు. ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్య వేక్షించారు.

గుర్రంకొండలో....

గుర్రంకొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ఇందిరమ్మకాలనీలో కొలువైన స్వామి వారి ఆలయంలో ఉదయాన్నే అర్చన, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాయంకాలం ఆలయంలో గీతాపారాయణం, భజనలను నిర్వహించారు. అన్ని గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.

కలకడలో....

కలకడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో కృష్ణాష్టమిని వేడుకగా చేసుకున్నారు. వేణుగోపాల్ స్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాలకు పెద్దఎత్తున ప్రజలు తీర్థప్రసాదాలను స్వీకరించారు. చిన్నారులు కృష్ణవేషధారణతో ఆకట్టుకున్నారు.

పెద్దమండ్యంలో....

పెద్దమండ్యం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో కృష్ణాష్టమి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉట్టి కొట్టే వేడుకలు జరిగాయి. చిన్నారి పిల్లలను శ్రీకృష్ణుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి.

కురబలకోటలో...

కురబలకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలం లోని తెట్టులో వెలిసిన సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కృష్ణ, గోపికల వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, సర్పంచ్ మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో....

తంబళ్లపల్లె, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు కృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా చేసుకున్నారు. శ్రీ కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలువురి ఇళ్లలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణ భగవానుడి చిత్ర పటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. తల్లితండ్రులు తమ చిన్నారులకు శ్రీ కృష్ణుడు, గోపి క వేషధారణలతో ముస్తా బు చేసి మురిసిపో యారు. మహిళలు సాయంత్రం ఇళ్ల ముంగిట సుద్ద వ ుుక్కలతో చిన్నిచిన్ని పాదాలు వేసి చిన్ని కృష్ణుడుని ఇళ్లలోకి ఆహ్వానించారు.

పీలేరులో....

పీలేరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను వేడుకగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి కళ్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. పీలేరు సహా పరిసర ప్రాంత యాదవ కుటుంబీకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


శ్రీకృష్ణుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష


పీలేరులో రాధాకృష్ణుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


ప్రత్యేక అలంకరణలో....


రాధాకృష్ణుల వేషధారులు

ఘాట్ రోడ్లలో నిలబడి ప్రయాణించరాదు

ఘాట్ రోడ్డులో స్త్రీ శక్తి వర్తించదన్నది ప్రచారమే ● జిరాక్సు గుర్తింపు కార్డులకు కూడా అనుమతి

టోల్ ఫీజు నుంచి మినహాయింపు : జిల్లా ప్రజా రవాణా అధికారి రాము

కలికిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కనుమ రహదారుల్లో (ఘాట్ రోడ్లు) వెళ్లే బస్సుల్లో మహిళలు నిల్చొని ప్రయాణించడంపై నియంత్రణ పాటించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రాము వెల్లడించారు. తాజాగా అందిన సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. తిరుపతి రోడ్డులోని భాకరాపేట ఘాట్ రోడ్డులో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. భాకరాపేట, రామసముద్రం మార్గంలో వున్న ఘాట్ రోడ్లపై ప్రయాణించే స్త్రీ శక్తి మహిళలకు ఉచిత ప్రయాణం వర్తించదని శనివారం ఉదయం నుంచి జోరుగా జరుగుతున్న ప్రచారంపై జిల్లా ప్రజా రవాణా అధికారి రాము స్పందించారు. అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకుండా ఘాట్ రోడ్డుపై మహిళలు నిల్చుని ప్రయాణం చేయడాన్ని మాత్రం నిలువరిస్తున్నట్లు చెప్పారు. రద్దీ అధికంగా వుంటే మదనపల్లె, పీలేరు, రాయచోటి డిపోల నుంచి అదనపు బస్సులను ఎప్పటికప్పుడు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా వున్నట్లు వివరించారు. మూడు రోజుల వరుస సెలవుల కారణంగా శనివారం అన్ని సర్వీసుల్లో ఆక్యుపెన్సీ కనీస స్థాయిలోనే వున్నట్లు చెప్పారు. ఉచిత ప్రయాణంతో మహిళా ప్రయాణీల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుందనే అంచనాల కారణంగానే కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని, అందులో నిల్చుని ప్రయాణించకుండా నివారించడం కూడా ఒకటని ఆయన విశదీకరించారు.

స్త్రీ శక్తి వర్తించదన్న ప్రచారం !

భాకరాపేట, మదనపల్లె-రామసముద్రం రోడ్డులోని ఘాట్ రోడ్ల మీద వెళ్లే సర్వీసుల్లో స్త్రీ శక్తి ఉచిత ప్రయాణ పథకం వర్తించదనే ప్రచారం శనివారం విస్తృతంగా కొనసాగింది. శుక్రవారం సాయంకాల ఐదు గంటల నుంచి జీరో టికెట్ల జారీ చేయనున్నట్లు ప్రకటించారు. సాయంకాలం ఐదు తరువాత మదనపల్లెలో బస్సులు బయలుదేరితే 75 కి.మీ భాకారాపేట ఘాట్ ప్రయాణానికి బాగా చీకటి పడుతుంది. ఆసమయంలో క్రిక్కిరిసిన ప్రయాణీకులతో ఘాట్‌లో నడపడం దుస్సాహసమవుతుందనే అప్రమత్తత కారణంగా ఘాట్ ప్రయాణానికి పథకం వర్తించదని సూటిగా చెపుతూ మదనపల్లె బస్టాండులో స్టిక్కర్లు అతికించారు. అధికారుల అంచనాలకు మేరకు మహిళలు రాకపోవడంతో వెంటనే నాలుక్కరుచుకుని స్టిక్కర్లు తొలగించేశారు. అప్పటికే స్టిక్కర్లను కొందరు మాధ్యమాల్లో ప్రచారం చేశారు.

గుర్తింపు కార్డులపై అవగాహనాలేమి

ఉచిత ప్రయాణానికి సరైన గుర్తింపు కార్డులు లేని కారణంగా అక్కడక్కడా సమస్యలు తలెత్తినట్లు డీపీటీఓ రాము, పీలేరు డీఎం నిర్మల తెలిపారు. చాలా మంది మహిళలు ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు చూపిస్తున్నారని చెప్పారు. ఇవన్నీ చెల్లుబాటవుతాయని అయితే వీటిలో ఏదో ఒకటి ఒరిజినల్ కార్డు వుండాలని స్పష్టం చేశారు. కొందరు జిరాక్సులు, మరి కొందరు ఫోనులో వున్న వాటిని చూపిస్తున్నారని నిబంధనల ప్రకారం అలాంటివి చెల్లవని కూడా చెప్పారు. కేవలం స్థానికత నిరూపణ కోసమే వీటిని తప్పనిసరి చేశారని గుర్తించాలన్నారు. ఇక నుంచి మహిళలు చెల్లుబాటయ్యే ఏదో ఒక ఒరిజనల్ కార్డును దగ్గరుంచుకోవాలని కూడా కోరారు.

టోల్ ఫీజు నుంచి మినహాయింపు

మహిళా ప్రయాణీకులకు చార్జీతోపాటు టోల్ ఫీజును కూడా మినహాయించినట్లు డీపీటీఓ రాము, డీఎం నిర్మల చెప్పారు. ఇటీవలే మదనపల్లె-తిరుపతి రోడ్డులో గండబోయనపల్లె వద్ద టోల్ ప్లాజా ప్రారంభించారని టిక్కెట్టు ధరకు అదనంగా ప్రయాణీకుల రూ.10 వంతున వసూలు చేస్తున్నట్లు చెప్పారు. అయితే జీరో టికెట్టుతో టోల్ వసూలు చేయమన్నారు.

జిరాక్సు కార్డులకు అనుమతి

స్త్రీ శక్తి పథకంలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి మహిళా ప్రయాణీకులు చూపించే జిరాక్సు, డిజిటల్ గుర్తింపు కార్డులను ఆదివారం నుంచి అనుమతించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రాము చెప్పారు. శనివారం రాత్రి ఆయన మాట్లాడుతూ తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ జిరాక్సు ప్రతులను అనుమతిస్తామని ఉన్నతాధికార్లు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రపంచ దేశాల్లో చేసుకునే పండుగ కృష్ణాష్టమి

యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్


తుర్లు ఆనంద్ యాదవ్‌ను సన్మానిస్తున్న సంఘం నేతలు

మదనపల్లె, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ చేసుకునే అన్ని పండుగల్లో జన్మాష్టమి ముఖ్యమైందని యాదవసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని యాదవసంఘం కార్యాలయంలో శనివారం జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కులాలు, మతాలకు అతీతంగా చేసుకునే పండుగగా అభివర్ణించారు. అనంతరం ఆనంద్‌యాదవ్‌ను సంఘ నేతలు సన్మానించారు. సంఘం నేతలు మజ్జిగ గోపాల్ యాదవ్, మునివీటి రెడ్డిబాబుయాదవ్, నవీనయాదవ్, షేక్ రహీమ్, షేక్ అబ్దుల్లా, అడ్వకేట్ విజయ్, షేక్ మఖ్‌బుల్, షేక్ అబ్దులా, నరసింహాయాదవ్, రమేష్‌యాదవ్, ఒటేష్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

బురకాయలకోటను మండలంగా ప్రకటించండి

● మంత్రి సత్యకుమార్‌ను కోరిన కూటమి నేతలు


మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ములకలచెరువు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బురకాయలకోటను మండల కేంద్రంగా ప్రకటించాలని టీడీపీ, బీజేపీ నేతలు మంత్రి సత్యప్రసాద్‌ను కోరారు. బి.కొత్తకోట మండలం హర్సిలీహిల్స్‌లో శనివారం మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. మండల వ్యవస్థ లేని సమయంలో కూడా బురకాయలకోట ఫిర్కాగా ఉండేదని, మండల వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు బురకాయలకోటను మండలంగా ప్రకటించి రాజకీయ కారణాలతో ములకలచెరువును మండల కేంద్రంగా చేశారన్నారు. ప్రభుత్వం కొత్తగా జిల్లాలు, మండలాలు ప్రకటిస్తున్నందున బురకాయలకోటను నూతన మండలాల జాబితాలో చేర్చాలని కోరారు. దేవళచెరువు, పర్తికోట, వేపూరికోట, మద్దినాయనిపల్లె, తుమ్మణంగుట్ట, బయప్పగారిపల్లె గ్రామాలు బురకాయలకోట సమీపంలో ఉన్నాయని, బురకాయలకోటను మండల కేంద్రంగా ప్రకటిస్తే ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. బురకాయలకోటలో ప్రభుత్వాస్పత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, ద్వారకనాథ్, టీడీపీ నేతలు ముత్తుకూరు మౌలా, విజయ్‌కుమార్, రామకృష్ణమరాజు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను పరిమళ భరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి అభిషేకాలను చేయించడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. భక్తులు కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

మదనపల్లె టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రజా జీవితానికి అడ్డంకిగా మారుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణికి విన్నవించారు. శనివారం సబ్‌కలెక్టర్‌ను కలిసిన అపెక్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ 12 ఏళ్లుగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తాము పోరాడుతున్నామన్నారు. పట్టణంలో రోడ్లన్నీ ఆక్రమణలకు గురయ్యాయని, వీటిని తొలగిస్తే ట్రాఫిక్ కుదుటపడుతుందన్నారు. ప్రధాన కూడళ్ల సమీపంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేస్తే పోలీసుల విధులకు కొంత ఊరట కలుగుతుందన్నారు. దీనిపై ట్రాఫిక్ అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వైఎస్ మునిరత్నం, టీఎస్‌ఏ కృష్ణమూర్తి, శకుంతలమ్మ, మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణ శనివారం ప్రత్యేక పూజలు

పెద్దమండ్యం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రావణ శనివారం ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమండ్యం, కలిచెర్ల, వెలిగల్లు, ముసలికుంట, సి.గొల్లపల్లి, చెరువుకిందపల్లి, గుడిసెవారిపల్లి, బాటవారిపల్లి తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు కిటకిట లాడారు. పలు గ్రామాల్లో అన్నదానం జరిగాయి. ఆయా గ్రామాల ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


మూరేవాండ్లపల్లెలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యం దృష్ట్యా డీపీటీ, టీడీ వ్యాక్సిన్ ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖాబేగం పేర్కొన్నారు. శనివారం మూరేవాండ్లపల్లెలో ప్రత్యేక టీకాల క్యాంపులపై ప్రజలకు అవగాహన కల్పించారు. 18 నుంచి 23వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఐదు నుంచి ఏడేళ్లలోపు పిల్లలకు డీపీటీ వ్యాక్సిన్, పదేళ్ల పిల్లలకు, 16ఏళ్ల పిల్లలకు టీడీ వ్యాక్సిన్లను వేస్తారన్నారు. ధనుర్వాతం, కోరింతదగ్గు, కంఠసర్ఫి, బ్యాక్టీరియాల ద్వారా వచ్చే ప్రమాదం ఉందని, పిల్లల్లో అనారోగ్య పరిస్థితులను మరణాలను తగ్గించడానికి వ్యాక్సినేషన్ చేపట్టేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ ప్రత్యేక టీకాల కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మొహ్మద్‌రఫీ, పీహెచ్‌సీ పుష్ప, ఏఎన్‌ఎం అనుసూయ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు.. ప్రోత్సాహకాలు



తిరుపతిలో ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషిరావు నుంచి అవార్డు అందుకుంటున్న ఏఈ సురేంద్ర

తంబళ్లపల్లె, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు తంబళ్లపల్లె సెక్షన్‌లోని పలువురు విద్యుత్ అధికారులకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని మంత్రి, కలెక్టర్, ఆ శాఖ సీఎండి నుంచి ప్రోత్సాహకాలు, ప్రశంసా పత్రం అందుకున్నారు. విద్యుత్ బిల్లుల వసూళ్లలో వంద శాతం పనితీరు, సిబ్బంది ఉత్తమ పనితీరుకు ఏపీ ఎస్పీడీసీఎల్ డిస్కం పరిధిలో తంబళ్లపల్లె సెక్షన్‌కు ఉత్తమ అవార్డు లభించింది. శుక్రవారం తిరుపతి ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కార్యాలయంలో సీఎండీ సంతోషిరావు నుంచి ఏఈ సురేంద్ర అవార్డును అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సబ్ ఇంజనీరు శేషకుమార్, గోపిదిన్నె జేఎల్‌ఎం నాగేంద్ర నాయక్, కుక్కరాజుపల్లె విద్యుత్ ఉపకేంద్రం డ్యూటీ ఆపరేటర్ మధుకర్ రాయచోటిలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ నుంచి ప్రశంసా పత్రం షీల్డును అందుకున్నారు.

డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీ సిబ్బంది నియామకం


ఎంపికైన సిబ్బందిని అభినందిస్తున్న వ్యవస్థాపకులు విజయభాస్కర్ చౌదరి

కురబలకోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్సిటీ సిబ్బందిని నియమిస్తూ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు ఎన్.విజయభాస్కర్ చౌదరి ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న ఆయనను నియమించారు. కాగా రిజిస్ట్రార్‌గా ప్రదీప్‌కుమార్, అదనపు రిజిస్ట్రార్‌గా ప్రతిభ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా సాయి కుమార్‌ను నియమిస్తూ నియామక ధృవపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం, మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే యూనివర్సిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేయడంతో పాటు, పలు విషయాలను చర్చించి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారిని పలువురు అభినందించారు.

ఆలయానికి ఉత్సవ గొడుగు వితరణ

వాల్మీకిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లెలో వెలసిన విరూపాక్షమ్మతల్లి ఆలయానికి దాతలు ఉత్సవ గొడుగు (ఛత్రం) కానుకగా అందజేశారు. పట్టణానికి చెందిన నల్లవీర గంగాభవాని ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్ కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి అమ్మవారి ఆలయానికి కానుకలు అందజేసి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో పలువురు నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక మహోత్సవం



మదనపల్లె అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లె రోడ్డులో ఉన్న వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యం స్వామి ఆలయంలో ఆడికృత్తిక మహోత్సవం ఆలయ ధర్మకర్తలు రాచపల్లె సుబ్రహ్మణ్యం, అనురాధ నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారిని పంచామృతాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం ఎమ్మెల్యే షాజహాన్‌బాష స్వామిని దర్శించుకున్నారు, పార్టీ నేతలు బాలుస్వామి, చల్లా నరసింహులు, కత్తిలక్ష్మన్న, చుక్కా విజయ్, యుగంధర్, రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కలిచెర్లలో 'సూపర్ సిక్స్' సంబరాలు

పెద్దమండ్యం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కలిచెర్లలో కూటమి నేతలు సూపర్ సిక్స్ సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అమలుతో మండల స్థాయిలో కూటమి నేతల సంబరాలు చేసుకున్నారు. కలిచెర్లలో రాయచోటి, మదనపల్లి - 2 డిపోల బస్సుల ఎదుట పూజలు, సూపర్ సిక్స్ కేక్ కట్ చేసి ప్రజలకు, ప్రయాణీకులకు స్వీట్లు, కేక్‌ను పంచిపెట్టారు. కూటమి నేతలు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ యుగంధర్‌రెడ్డి, ప్రభాకరరెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, మేకల చలపతి, నార గంగాధర, రఘునాధరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఖాదర్‌హుసేన్, మస్తాన్‌నాయుడు, రత్నకుమారి, రేషిత, పద్మజా, శ్రీవాణీ, జయరాణిమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తా

మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నమ్ముకున్న కార్యకర్తల కోసం ఎంత దూరమైన వెళ్తానని తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ అన్నారు. శుక్రవారం దాడిలో గాయపడిన రాజంపేట పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు అవికేనాయక్ తండా సర్పంచ్ నటరాజ్ నాయక్, తంబళ్లపల్లె నియోజకవర్గం ఐటీడీపీ అధ్యక్షుడు సాగర్‌కుమార్‌ను పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గం టీడీపీ పలు మండలాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

ములకలచెరువు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి టి.కృష్ణప్ప పిలుపు నిచ్చారు. సీపీఐ కార్యాలయంలో జరిగిన ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20 నుంచి 25వతేదీ వరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో 28వ మహాసభలు జరుగుతాయన్నారు. 23న భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందన్నారు. మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు.

రెండు లారీలు ఢీ - డ్రైవర్లకు గాయాలు


ఢీకొన్న లారీలు

ములకలచెరువు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ముంబై - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు శనివారం ఉదయం ఢీకొన్నాయి. ఫ్లైఓవర్ వంతెన వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన డ్రైవర్ల పూర్తి వివరాలు ఇంకా అందలేదని పోలీసులు తెలిపారు.

వేడుకగా శ్రావణ పూజలు

రామసముద్రం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శ్రావణ మాసం పూజలు శనివారంతో ముగిశాయి. ఆలయం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు సుమారు కిలోమీటరు మేర బారులు తీరారు. భక్తుల కోసం ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతి రెడ్డి, ఉపాధ్యక్షుడు మునిస్వామి, కార్యదర్శి ఎం.ఈశ్వర్, టి.శ్రీనివాసులు, ఉప సర్పంచ్ రమేష్, కనక కమిటీ సభ్యులు పెద్దలు క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.